www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229



విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039



సంపుటి : 17 | సంచిక : 182 | బుధవారం 26.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-


# మూసీ ప్రాజెక్ట్‌పై రేవంత్ స్పీడ్..

## ఫేజ్-2 పనులకు త్వరలోనే టెండర్లు

### టీడీఆర్ జారీపై వారానికోసారి సమీక్ష

### ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధి విధానాలు



- భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి: సీఎం
- ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలి
- బాధితులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు
- ఫేజ్-2 పనులకు త్వరగా టెండర్లు పిలవాలి
- పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదు: సీఎం
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌పై అధికారిక స్పష్టత ఇవ్వాలి
- తక్కువ వడ్డీ రుణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- పర్యాటక ప్రాజెక్టులకు వేగంగా టెండర్లు ఆహ్వానించాలి

02

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ, ల్యాండ్ పూలింగ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ అంశాల్లో స్పష్టతతో పాటు బాధితులకు న్యాయమైన పరిహారం అందించాలని సూచించారు.ప్రాజెక్టు పనుల్లో జాప్యం లేకుండా ఫేజ్-2 టెండర్లను త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. టీడీఆర్ వినియోగం, భూసేకరణ పురోగతిపై అధికారులు ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని సూచించారు.భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, బాధితులకు ప్రయోజనం కలిగేలా ల్యాండ్ పూలింగ్ విధానాన్ని రూపొందించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. పర్యాటక అభివృద్ధి పనులకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.ప్రాజెక్టు పరిధిలోని భూములపై నెలకొన్న అనుమానాలను త్వరగా నివృత్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. తక్కువ వడ్డీ రుణాల సమీకరణతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.హైదరాబాద్ అభివృద్ధికి కీలకమైన ప్రాజెక్టు పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# 11 మంది నకిలీ వైద్యుల అరెస్ట్

## హైదరాబాద్‌లో నకిలీ డాక్టర్ల గుట్టురట్టు..



- హైదరాబాద్‌లో నకిలీ డాక్టర్ల గుట్టురట్టు
- డిగ్రీ లేకుండానే వైద్యం.. 11 మంది అరెస్ట్
- ప్రజల ప్రాణాలతో చెలగాటం.. ఫేక్ డాక్టర్లు
- నకిలీ సర్టిఫికెట్లతో వైద్యం.. పోలీసుల దాడులు

02



# హైదరాబాద్ లో పిల్లల కిడ్నాప్..

### నాలుగు గంటల్లోనే దొరికిండు !

- భిక్షాటన చేయించే ముఠాలకు అమ్మాలని చూసిండు..
- సాంకేతిక ఆధారాలతో కిడ్నాపర్‌ను పట్టుకున్న పోలీసులు

02

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### నిజామాబాద్ లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం



- యువతే దేశానికి బలం.. నషాకు దూరంగా ఉండాలి
- నషా ముక్త్ సమాజానికి యువత భాగస్వామ్యం కీలకం
- నషాకు నో.. జీవితానికి ఎస్: గవర్నర్ పిలుపు
- మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి
- యువతలో చైతన్యమే నషా రహిత సమాజానికి బలం

03

# సీఎం వల్ల దేశ భద్రతకు ముప్పు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీసిన అర్వింద్
- విద్యాసంస్థల పరిస్థితిపై రేవంత్ సర్కార్‌పై విమర్శలు
- రాష్ట్రంలో ఉన్న వాటికే దిక్కులేదు.. విదేశాల నుంచి సంస్థలా?
- రేవంత్ పాలనపై ప్రజలు నిర్ణయానికి వచ్చారు: అర్వింద్



05

# 22ఏ ఉచ్చులో ప్రజల ఆస్తులు

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి..

### భూ భారతిని... భూ మేతగా మార్చారు

- 22ఏ బాధితులకు హరీశ్‌రావు అండగా.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది
- పట్టా భూములను 22ఏలో చేర్చడంపై బీఆర్ఎస్ ఆగ్రహం
- 22ఏ దందాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- భూ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే 22ఏ దందా
- సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీలో 22ఏపై పోరాటం

03



# రేవంత్ వ్యాఖ్యలు అర్థరహితం

## దేశ ప్రయోజనాల దృష్ట్యా అనుమతులు

### సింగరేణి ఆర్థిక ఇబ్బందుల్లో.. రూ.55 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

### విదేశీ పర్యటనపై రేవంత్ బాధ్యతగా వ్యవహరించాలి



- కేంద్ర అనుమతి లేకుండానే అమెరికా పర్యటన: కిషన్‌రెడ్డి
- రేవంత్ అమెరికా టూర్‌పై కేంద్రం క్లారిటీ
- విదేశీ పర్యటనపై రేవంత్ బాధ్యతగా వ్యవహరించాలి
- అమెరికా పర్యటన అనుమతిపై కిషన్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు
- రేవంత్ ఎవరిని కలవాలనుకున్నారో చెప్పాలి: కిషన్‌రెడ్డి
- దేశ ప్రయోజనాల దృష్ట్యా అనుమతులు: కిషన్‌రెడ్డి
- రేవంత్ అమెరికా టూర్ వివాదంపై కిషన్‌రెడ్డి కౌంటర్

03

# ప్యాకేజ్డ్ ఫుడ్స్‌పై 'రెడ్ ఫ్లాగ్' రూల్

## ప్రజల ఆరోగ్యమా.. కంపెనీల లాభాలా?

### విదేశాల్లో రెడ్ లేబుల్స్.. భారత్‌లో మాత్రం ఎందుకు కాదు?



- ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరిక లేబుళ్లపై కీలక నిర్ణయం
- చిప్స్, సాఫ్ట్ డ్రింక్స్‌పై రెడ్ వార్నింగ్ ఎందుకు వద్దన్నారు?
- ఫుడ్ కంపెనీల ఒత్తిడికి ఎఫ్ఎస్ఎస్ఏఐ వెనక్కి?
- ప్యాకేజ్డ్ ఫుడ్‌పై హెచ్చరికలపై సుప్రీంకోర్టు జోక్యం
- ప్రజల ఆరోగ్యమా.. కంపెనీల లాభాలా?
- చక్కెర, ఉప్పు, కొవ్వుపై హెచ్చరికలకు వ్యతిరేకత

02

### ఆహార భద్రతపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



# నారా లోకేష్ కీలక ప్రకటన!

- పునరుత్పాదక ఇంధనంలో ఏపీని నంబర్ వన్ చేస్తాం
- గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులతో వేలాది ఉద్యోగాలు
- ఏపీలో 1.3 గిగావాట్ల రెన్యూవబుల్ ఎనర్జీకి పెట్టుబడులు
- స్థానిక యువతకు 4 వేల ఉద్యోగాలు: నారా లోకేష్
- అనంతపురంలో సుజ్లాన్ ప్రాజెక్టులతో భారీ ఉపాధి
- గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీకి భారీ పెట్టుబడులు

03

### పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీకి కొత్త ఊపు




# హైదరాబాద్ లో పిల్లల కిడ్నాప్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఇద్దరు మైనర్ బాలికల కిడ్నాప్ కేసును సైబరాబాద్ పోలీసులు కేవలం 4 గంటల్లోనే ఛేదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శేరిలింగంపల్లి జోన్ డిసిపి సి హెచ్ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. కొండాపూర్‌లోని లేబర్ క్యాంప్‌లో ఆడుకుంటున్న ముగ్గురు ప్రమీల ముర్ము (4), సంగీత హేమరామ్ (3) అనే చిన్నారులను అదే క్యాంప్‌లో చాకు సోరెన్ (45) అనే వ్యక్తి కిడ్నాప్ చేసి పరారయ్యాడు.బాధితుల ఫిర్యాదుతో వెంటనే రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు రైల్వే పోలీసులను, స్థానిక స్టేషన్లను అప్రమత్తం చేశాయి. సాంకేతిక ఆధారాలతో ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఇద్దరు చిన్నారులను సురక్షితంగా రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన నిందితుడు చాకు సోరెన్‌పై గతంలో హత్యాయత్నం, అత్యాచారం కేసులు నమోదై ఐదేళ్ల జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బు కోసం పిల్లలను అపహరించి భిక్షాటన చేయించే ముఠాలకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. నిర్మాణ సంస్థలు, లేబర్ క్యాంపులు కార్మికుల వివరాల రిజిస్టర్, సీసీటీవీల ఏర్పాటుతో భద్రతను పటిష్టం చేయాలని డీసీపీ సూచించారు.

# ప్యాకేజ్డ్ ఫుడ్స్‌పై 'రెడ్ ఫ్లాగ్' రూల్

**న్యూ ఢిల్లీ :** దేశంలో విక్రయించే సాఫ్ట్ డ్రింక్స్, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, చిప్స్ ప్యాకెట్లపై రెడ్-ఫ్లాగ్ ముద్రించాలనే నిబంధనలపై మల్టీ నేషనల్ ఫుడ్ కంపెనీల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దీంతో భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ), ఆ హెచ్చరిక లేబుళ్ల విధింపు నిర్ణయాన్ని విరమించుకున్నట్లుగా తెలుస్తోంది. ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ప్యాకెట్ ముందు భాగంలో చక్కెర, కొవ్వు, ఉప్పు పరిమాణాలు ఎక్కువగా ఉంటే వాటిపై కలర్ కోడెడ్ వార్నింగ్ గుర్తులను తప్పనిసరి చేయాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ భావించింది. అయితే, ఆహార కంపెనీలతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆ నిర్ణయాన్ని మల్టీ నేషనల్ ఫుడ్ కంపెనీల ప్రతినిధులు, యజమానులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్యాకెట్లపై రెడ్ ఫ్లాగ్స్, రంగుల హెచ్చరిక గుర్తులు వేయడం వల్ల వినియోగదారులు అయోమయానికి గురవుతారని సదరు కంపెనీలు వాదించాయి. భారతీయ వంటకాలు ప్రత్యేకమైన రుచులను కలిగి ఉంటాయని, కాబట్టి విదేశాల్లో లాగా మన దేశంలో అలా చేయలేమని

**నలుపు, తెలుపు రంగుల ముద్రణ..**

హెచ్చరిక గుర్తులకు బదులుగా, కేవలం నలుపు-తెలుపు రంగుల్లో సమాచార పట్టికను ప్రదర్శించడానికి, పోర్షన్ కంట్రోల్‌పై అవగాహన పెంచడానికి మొగ్గు చూపాలని రెగ్యులేటర్‌ను కోరాయి. పరిశ్రమ ప్రతినిధుల ఒత్తిడితో ఎఫ్ఎస్ఎస్ఏఐ కలర్ కోడెడ్ లేబుళ్ల విధానాన్ని విరమించుకుని కేవలం నలుపు, తెలుపు చార్ట్‌కే పరిమిత మవ్వడంపై ప్రజారోగ్య నిపుణులు మాత్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**విదేశాల్లో ఒకలా.. భారత్‌లో మరోలా?**

మల్టీ నేషనల్ ఫుడ్ కంపెనీల విదేశాల్లో ఓ విధానాన్ని, భారత్‌లో మరొక విధానాన్ని అవలంభిస్తున్నాయి. కోకాకోలా, నెస్లే వంటి కంపెనీలు బ్రిటన్, అనేక యూరోపియన్ దేశాల్లో 'ట్రాఫిక్ లైట్' రంగుల హెచ్చరిక లేబుళ్లను స్వచ్ఛందంగా ఉపయోగిస్తున్నాయి. కానీ భారత మార్కెట్‌లో మాత్రం ఇటువంటి స్పష్టమైన హెచ్చరికలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. భారత్‌లో విక్రయించే ప్యాకేజ్డ్ డ్రింక్స్‌లో విదేశాలతో పోలిస్తే.. షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటోంది. ఇక లండన్‌లో విక్రయించే డ్రింక్స్‌లో భారత్‌లో విక్రయించే పానీయంలో మూడు రెట్లు ఎక్కువ షుగర్ ఉండటంతో పాటు ఆర్టిఫిషియల్ కలర్స్ ఎక్కువగా ఉంటున్నాయి. ఇతర దేశాల్లో నాణ్యమైన ఆయిల్స్ నూనెలు, కోకో పౌడర్ ఉపయోగిస్తుండగా, భారత్‌లో చౌకగా లభించే పామాయిల, తక్కువ శాతం కోకో పరిమాణంతో పదార్థాలను తయారు చేస్తున్నట్లుగా ఎఫ్ఎస్ఎస్ఏఐ నివేదికల్లో వెల్లడైంది.

**సుప్రీంకోర్టు జోక్యం..**

అయితే, ఎఫ్ఎస్ఎస్ఏఐ తీసుకున్న తాజా నిర్ణయంపై ప్రజారోగ్య కార్యకర్తలు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కార్పొరేట్ కంపెనీల లాభాల కంటే దేశ పౌరుల ఆరోగ్య భద్రతే ముఖ్యమని, వినియోగదారులకు పదార్థాల నాణ్యతపై స్పష్టమైన సమాచారం అందాలని న్యాయస్థానం స్పష్టం చేస్తూ, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. మరొకవైపు, సోషల్ మీడియాలో హెల్త్ ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ ఉత్పత్తుల్లోని హానికర పదార్థాలపై అవగాహన కల్పిస్తుండటంతో, కంపెనీలు వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేసేందుకు సిద్ధం అవుతున్నాయి.

# లంచం ఇస్తే సాదా బైనామా

**నల్గొండ,ఫ్లాష్ ఇండియా :** సాదాబైనామా కింద కొన్న భూమిని అప్రూవ్ చేయించుకునేందుకు వచ్చిన ఓ బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేసిన డిప్యూటీ తహసీల్దార్‌పై బాధితుడు నల్గొండ కలెక్టర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. నల్గొండ మండలం సందెనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి.. సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూమిని అప్రూవల్ చేయాలంటూ తహసీల్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకున్నాడు.డీటీ విజయ శేఖర్, సదరు బాధితుడి నుంచి డబ్బులు గుంజాలని ప్లాన్ చేశాడు. ఆఫీసులో పనిచేసే జీపీవో లచ్చయ్యను మధ్యవర్తిగా పెట్టుకొని, డబ్బులు ఇస్తేనే పని చేస్తానంటూ బాధితుడిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో బాధితుడు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఆయన.. తహసీల్ ఆఫీస్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాల్సిందిగా ట్రైనీ కలెక్టర్‌ను ఆదేశించారు.

**జీపీవో సరెండర్.. డీటీపై విజిలెన్స్ ఎంక్వయిరీ**

ప్రాథమిక విచారణలో అక్రమాలు నిజమేనని తేలడంతో.. డీటీ విజయ శేఖర్, జీపీవో లచ్చయ్యలపై శాఖాపరమైన విచారణ జరపాల్సిందిగా తహసీల్దార్‌ను ట్రైనీ కలెక్టర్ ఆదేశించారు. దీంతో జీపీవోను సరెండర్ చేశారు. మరోవైపు, ఈ అక్రమాల్లో ప్రధాన సూత్రధారిగా ఉన్న డిప్యూటీ తహసీల్దార్‌పై తాను స్వ-యంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ట్రైనీ కలెక్టర్ స్పష్టం చేశారు.

# యూరియా కోసం అష్టకష్టాలు!

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఎరువుల యాప్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా స్టాక్ వివరాలు ఈ-యాప్ అప్‌లోడ్ చేసిన 5 నుంచి 10 నిమిషాల్లోనే స్టాక్ అయిపోతోంది. వరి సాగు తగ్గించి ఆరుతడి పంటలు సాగు చేయాలని అధికారులు అవగాహన కల్పించడంతో కొంతవరకు వరి సాగు తగ్గింది. అయినప్పటికీ సిద్దిపేట డివిజన్ పరిధిలో యూరియా డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. డిమాండ్‌కు తగినట్లుగా యూరియా సరఫరా చేయాలని అధికారులు నివేదికలు పంపినప్పటికీ, యాప్‌లోనే బుక్ చేసుకోవాలనే నిబంధన రైతులకు శాపంగా మారింది.సిద్దిపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో గతేడాది వరి సాగు 86 వేల ఎకరాలు కాగా, ఈ వానకాలంలో 73 వేల ఎకరాలకు పడిపోయింది. ఆ స్థానంలో కంది, మొక్కజొన్న తదితర ఆరుతడి పంటలు సాగయ్యాయి. ఈ వానకాలం సీజన్‌కు 12వేల మెట్రిక్ టన్నుల యూరియా డిమాండ్ ఉండగా, నేటి వరకు కేవలం 4,500 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయింది. మరోవైపు యాప్‌లో సర్వర్ డౌన్ కావడం, ఓటీపీలు సకాలంగా రాకపోవడం, స్టాక్ అయిపోయినా అదనంగా బుకింగ్ కావడంతో గందరగోళం నెలకొంటున్నది.నంగునూరు మండలం వెంకటాపూర్ మురుదాబాద్, మైసంపల్లి గ్రామాలు ఈ-యాప్ కనిపించడం లేదు. ఫార్మర్ రిజిస్ట్రీ నుంచే ఆ గ్రామాల పేర్లు రాలేదు. ఎల్‌జీ కోడ్స్ మ్యాప్ కాలేదు. అప్పటి నుంచి అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదు. యాప్‌లో ఆ రెండు గ్రామాల పేర్లు లేక ఇతర గ్రామాల రైతులను ఆశ్రయించి ఎంతో కొంత ఎరువులు తెచ్చుకుంటున్నారు.

**ఎర్రబడుతున్న మొక్కజొన్న, వరి చేన్లు**

దౌల్తాబాద్ మండలంలోనూ యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాలో ఈ వానకాలంలో సుమారు 6 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. 3 లక్షల పైగా ఎకరాల్లో వరి, 75 వేల ఎకరాల్లో పత్తి, 80 వేల ఎకరాల్లో మొక్కజొన్న, లక్ష ఎకరాల్లో మిర్చి ఇతర కూరగాయ పంటలు సాగు చేశారు. యూరియా కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో

# రాజకీయాలకు నితిన్ గడ్కరీ గుడ్ బై?..

**న్యూ ఢిల్లీ :** రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల కాలంలో సెంటర్ ఆఫ్ డిస్కషన్‌గా మారుతున్నారు. ముఖ్యంగా ఈ-20 పెట్రోల్ విషయంలో గడ్కరీ చేస్తున్న వాదనలపై వాహనదారుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో గడ్కరీ పేరు నిత్యం వార్తల్లో నిలుస్తూనే ఉంది. అయితే ఇథనాల్ బ్లెండెడ్ విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్న నితిన్ గడ్కరీ రాజకీయాలకు గుడ్ బై చెప్పే యోచనలో ఉన్నారా? పాలిటిక్స్ కు తీసుకునేందుకు ఆయన సిద్ధమయ్యారా? అంటే తాజాగా ఆయన చేసిన మాటలను బట్టి అవును అనే చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తోంది. త్వరలో కేంద్ర కేబినెట్‌లో మార్పులు చేర్పులు ఉండబోతున్నాయన్న ఊహాగానాలు మధ్య నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి.

**కొత్తవారికి బాధ్యతలు:**

తాజాగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త తరానికి బాధ్యతలు అప్పగించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. 'నేను చేయాలనుకున్నంత కాలం పని చేశాను. తాను గతంలోలా ఎక్కువగా పనిచేయలేకపోతున్నాను. ప్రజా పనుల్లో ప్రమేయం తగ్గిపోయింది. ఆ పనిని కొత్త తరాలకు అప్పగించాలి. కొత్త వారికి సీనియర్లు మార్గనిర్దేశం చేయాలి. గత 30 ఏళ్లుగా ప్రజా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. ప్రశంసలు అందుకున్నాను' అని గుర్తు చేశారు. నితిన్ గడ్కరీ చేసిన ఈ వ్యాఖఅయలు రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**ధర్మేంద్ర ప్రదాన్ తర్వాత టార్గెట్‌గా గడ్కరీ:**

ప్రస్తుతం కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా తర్వాత సోషల్ మీడియాలో నితిన్ గడ్కరీ టార్గెట్‌గా మారారు. ఈ-20 పెట్రోల్ విషయంలో నెటిజన్లు ఆయనపై తీవ్ర సా-ధ్యయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా తనకు సంబంధం లేని పెట్రోలియం శాఖకు సంబంధించిన విషయంలో నితిన్ గడ్కరీ తరచూ ఎందుకంతా ఇంపార్టెంట్ చూపిస్తున్నారు? తన కుమారులకు ఇథనాల్ వ్యాపారం ఉంది కాబట్టే ఈ-20కి అనుకూలంగా మాట్లాడుతున్నారంటూ కామెంట్ల రూపంలో నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ఇదిలా ఉంటే త్వ-రలో జరగబోయే మార్పులు కేబినెట్ మా-ర్పుల్లో నితిన్ గడ్కరీ విషయంలో బిగ్ డిసిషన్ ఉండబోతోందా అందులో భాగంగానే గడ్కరీ ఈ తరహా వ్యాఖ్యలు చేశారా అనే వాదనలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ విషయంలో ప్రధాని మోడీ, అమిత్ షా ఇప్పటికే అన్ని సమీకరణాలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక మహారాష్ట్ర రాజకీయం సైతం ఆసక్తిగా మారింది. ఇక్కడ బీజ్జేపీ, మిత్రపక్షమైన ఎన్సీపీకీ చెందిన కొత్త వారికి మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల శరద్ పవార్ సైతం ప్రధాని మోడీని కలవడం హాట్ టాపిక్ అయింది. ఈ క్రమంలో నితిన్ గడ్కరీ కొత్త తరానికి బాధ్యతలు అప్పగించాలన్న వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారి తీసింది.

**స్పందించిన మంత్రి కార్యాలయం:**

అయితే నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు పెద్ద ఎత్తున డిస్కషన్ జరుగుతున్న నేపథ్యంలో మంత్రి కార్యాలయం స్పందించింది. మంత్రి వ్యాఖ్యలకు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చింది. గడ్కరీ మాట్లాడింది లక్ష్మణ్ రావు మన్కర్ ట్రస్ట్ గురించి అని దాని ఏర్పాటు చేసింది ఆయ-నేనని పేర్కొంది. ఈ ట్రస్ట్ కింద ఆదివాసీ ప్రాంతాల్లో విద్యాసంస్థలు నడుస్తున్నాయని మునుపటిలా ఆ ట్రస్టు బాధ్యతలు తాను నిర్వహించలేనని యువతరానికి అవకాశం ఇవ్వాలని మాత్రమే అన్నారని పేర్కొన్నారు. కానీ మంత్రి వ్యాఖ్యలను మీడియా రాజకీయాలకు ముడిపెట్టిందని వివరణ ఇచ్చారు. మంత్రి కార్యాలయం చెప్పినట్లు ఇది కేవలం ట్రస్ట్ వరకే పరిమితం అవుతుందా లేక త్వరలో జరగబోయే కేబినెట్ విస్తరణలో బిగ్ బ్లాస్ట్ ఏదైనా ఉండబోతోందా అనేది కాలమే నిర్ణయించనుంది.

# 11 మంది నకిలీ వైద్యుల అరెస్ట్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మహా నగరం హైదరాబాద్‌లో 11 మంది నకిలీ డాక్టర్లు అరెస్ట్ కావడం తీవ్ర కలకలం గా మారింది. ఎలాంటి వైద్య అర్హతలు లేకుండానే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న భారీ నకిలీ డాక్టర్ల ముఠా గుట్టును సిటీ పోలీసులు రట్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన పోలీసులు, డాక్టర్లుగా చలామణి అవుతున్న 11 మంది నకిలీ వైద్యులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కనీస వైద్య విద్య, గుర్తింపు పొందిన డిగ్రీలు లేకపోయినా.. పెద్ద పెద్ద ప్రిస్క్రిప్షన్ రాస్తూ, ఇంజెక్షన్లు, యాంటీబయాటిక్స్ ఇస్తూ సామాన్య ప్రజలను మోసగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.వీరిలో కొందరు నకిలీ సర్టిఫికెట్లతో ప్రైవేట్ క్లినిక్‌లు నడపడమే కాకుండా, మరి కొందరు ప్రముఖ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పేర్లను వాడుకుంటూ వైద్య సేవలు అందిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరి క్లినిక్‌ల నుంచి భారీ ఎత్తున నకిలీ లెటర్‌హెడ్‌లు, అనుమతి లేని మందులు, వైద్య పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమాయక ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న ఇలాంటి నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అర్హత లేని వ్యక్తుల వద్దకు వెళ్లి చికిత్సలు చేయించుకోవద్దని ప్రజలకు పోలీసు ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు.

# మూసీ ప్రాజెక్ట్‌పై రేవంత్ స్పీడ్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగర ప్రక్షాళనతో పాటు ప్రతిష్టాత్మక మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ ఉన్నతస్థాయి సమావేశంలో హెచ్ఎమ్‌డీఏ, జీహెచ్ఎమ్‌సీ, ఎంఆర్‌డీసీ-ఎల్ కమిషనర్లు, ఎండీలు , రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. మూసీ ప్రాజెక్ట్ పురోగతిని సమీక్షించిన సీఎం, పనుల్లో వేగం పెంచాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**భూసేకరణ వేగవంతం.. ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టత**

మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ల్యాండ్ పూలింగ్ విధానంపై పారదర్శకమైన నిబంధనలను రూపొందించుకోవడంతో పాటు ఎఫ్టీఎల్ , బఫర్ జోన్ , అసైన్డ్ భూముల సేకరణ విషయంలో స్పష్టమైన విధానాన్ని తయారు చేసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ సమయంలో భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ఫేజ్-2 టెండర్లు.. పర్యాటక రంగ అభివృద్ధి**

మూసీ ప్రాజెక్ట్ ఫేజ్-2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని, ప్రాజెక్టుల నిర్మాణానికి అతి తక్కువ వడ్డీకి లభించే రుణాలపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. అంతేకాకుండా టీడీఆర్ కేటాయింపులపై ప్రతి వారం సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రాజెక్ట్‌తో పాటు పరిసర ప్రాంతాల పర్యాటక అభివృద్ధిపై ఫోకస్ పెట్టిన సీఎం, మంచిరేవులలోని ఓంకారేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి టెండర్లను తక్షణమే ఆహ్వానించాలని, కొత్వాల్‌గూడా బర్డ్స్ పార్క్‌కు ప్రచారం కల్పించి పర్యాటకులను ఆకట్టుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు 2 రోజుల నిరాహార దీక్ష



**మేడ్చెల్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయక కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో రాష్ట్రంలోనినలు మూలలనుంచి బీజేపీ రాష్ట్ర నాయకులు కార్యకర్తలు మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని రిలే నిరాహార దీక్ష చేపట్టారు.బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుకు సంఘీభావంగా మేడ్చల్ జిల్లా బిజెపి బిల్డర్స్ సెల్ కన్వీనర్ పాలకుర్తి శేషగిరిరావు నిరాహార దీక్షలో పాల్గొని ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే రిలీజ్ చేసి విద్యార్థుల భవిష్యత్తు బాసటగా నిలవాలని రోజురోజుకు రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని, కాలేజీలో అధిక ఫీజులు నియంత్రించి సకాలంలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే రిలీజ్ చేయాలని బిజెపి బిల్డర్ సెల్ కన్వీనర్ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డిమాండ్ చేశారు. లేని పక్షాన మేడ్చల్ జిల్లాలోని మండలాల వారీగా రిలే నిరాహార దీక్ష చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# తెలంగాణకు అన్యాయం

## కాళేశ్వరంపై కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారానికి ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూ పీఆర్ఎస్ రిపోర్టులు చెంపపెట్టు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరంపై కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారానికి ఎన్‌డీఎస్ఏ అఫిడవిట్, సీడబ్ల్యూ పీఆర్ఎస్ రిపోర్టులు చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం మొత్తం కుప్పకూలిందని ప్రాజెక్టు పనికిరాదు.. నీళ్లు ఎత్తలేమంటూ ఇన్నాళ్లుగా కాంగ్రెస్ చేసిన ప్రచారం ఒక్కొక్కటిగా పటాపంచలవుతోందన్నారు. ఈ మేరకు ఇవాళ ప్రెస్ నోట్ విడుదల చేసిన ఆయన.. అవసరాన్ని బట్టి కాళేశ్వరం నుంచి నీటిని లిఫ్ట్ చేసుకోవచ్చని స్వయంగా ఎన్‌డీఎస్ఏ అఫిడవిట్‌లో స్పష్టం చేసిందని, మరోవైపు డబ్ల్యూ పీఆర్ఎస్ పరిశీలనలో అన్నారం, సుందిళ్లలో ఏ బ్లాక్‌లోనూ నిర్మాణపరమైన సమస్య లేదని, కాంక్రీట్ నాణ్యత కూడా బాగుందని వెల్లడైందన్నారు. అయినా రాజకీయ కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టును పక్కన పెట్టి, తెలంగాణకు వచ్చిన గోదావరి నీటిని వినియోగించుకోకుండా కిందికి వదిలేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు నిదర్శనం అని దుయ్యబట్టారు.

**తెలంగాణకు అన్యాయం:**

కాళేశ్వరం ప్రాజెక్టును నిందిస్తూ నీటిని లిఫ్ట్ చేయకుండా ఏపీకి వదిలిపెట్టడం ద్వారా తెలంగాణ రైతాంగానికి తీరని నష్టం చేశారని, మేము నిలదీసిన తర్వాతే ఆలస్యంగా దేవాదుల, నంది పంపులు ఆన్ చేశారన్నారు. అప్పటికే వరద నీరంతా కిందికి వెళ్లిపోయిందని చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు ఆలస్యంగా పంపులు ఆన్ చేసి.. ఆ తర్వాత వెంటనే ఆఫ్ చేశారని విమర్శించారు. ఏపీకి నీళ్లు వదిలి తెలంగాణ రైతులకు కన్నీళ్లు మిగిల్చారని పేర్కొన్నారు. దీంతో దేశవ్యాప్తంగా జలాశయాల్లో నీటి నిల్వలు సగటున 64.16 శాతం ఉంటే.. తెలంగాణలో మాత్రం కేవలం 35.6 శాతం మాత్రమే ఉందన్నారు. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు.. నీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.

**పార్టీలో కొట్లాటలు పక్కన పెట్టండి..**

బీఆర్ఎస్ హయాంలో నీటి నిర్వహణలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ నేడు జలాశయాల్లో నీటి నిల్వల విషయంలో బీహార్‌తో పోటీ పడే దుస్థితికి చేరిందని, నిండుగా పారిన గోదావరి, కృష్ణా నీళ్లను కిందకు విడిచిపెట్టి రాష్ట్రానికి చేసిన కాంగ్రెస్ ద్రోహం ఫలితం ఇదని దుయ్యబట్టారు. కమిషన్లు వేయడానికి, విచారణలు చేయడానికి ఉన్న శ్రద్ధ.. కిందికి పోతున్న గోదావరి, కృష్ణా జలాలను ఒడిసిపట్టి రైతులకు అందించడంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. ఎల్ నినో ప్రభావం, భవిష్యత్ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని విపక్షాలు, ఇంజినీర్లు హెచ్చరిస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఇది రాజకీయ కక్షలకు సమయం కాదు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడాల్సిన సమయం అని అందువల్ల కాంగ్రెస్ పార్టీలో కుమ్ములాటలు, కొట్లాటలపై శ్రద్ధ పక్కనపెట్టి ప్రాజెక్టుల నిర్వహణ, నీటి హక్కులు, రైతుల ప్రయోజనాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం మానేసి, అన్నారం, సుందిళ్ల మోటార్లు ఆన్ చేసి గోదావరి నీటిని ఎత్తిపోయాలని, రిజర్వాయర్లు నింపి రైతుల పొలాలకు నీళ్లు అందివ్వాలని డిమాండ్ చేశారు.

# నారా లోకేష్ కీలక ప్రకటన!

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ గ్రూప్ చేపడుతున్న ప్రాజెక్టుల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అదనంగా 1.3 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుజ్లాన్ గ్రూప్ పెట్టుబడులు పెడుతోందని నారా లోకేష్ వెల్లడించారు. ఉరుకొండ వద్ద ఉన్న బ్లేడ్ల తయారీ యూనిట్ విస్తరణతో పాటు కొత్త ప్రాజెక్టుల ద్వారా దాదాపు 4,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. 2016లో ప్రారంభమైన అనంతపురం సుజ్లాన్ ప్లాంట్ ద్వారా ఇప్పటికే సుమారు 2,000 మందికి ఉపాధి లభించిందని మంత్రి పేర్కొన్నారు. ఇందులో దాదాపు 70 శాతం మంది స్థానిక యువత ఉండటం సంతోషకరమన్నారు. స్థానిక ఐటీఐలను దత్తత తీసుకుని శిక్షణ అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.సుజ్లాన్ సంస్థ వర్క్‌ఫోర్స్‌లో 40 శాతం మంది మహిళలు ఉండటం అభినందనీయమని నారా లోకేష్ అన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరగడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని తెలిపారు. పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులతో నెలవారీ సమావేశాలు నిర్వహించి పరిశ్రమలకు ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక అడ్వైజరీ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. పెట్టుబడులు ఆలస్యం కాకుండా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగానికి అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేసి భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నారా లోకేష్ పేర్కొన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** నషా ముక్త్ సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. నిజామాబాద్‌లోని భూమారెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల ప్రభావానికి యువత దూరంగా ఉండి విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, నవకల్పన, దేశసేవ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో నశాముక్త భారత్ అభియాన్ విస్తృత ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటోందని గవర్నర్ అన్నారు. మాదకద్రవ్యాలపై చట్టపరమైన చర్యలతో పాటు యువతలో అవగాహన, చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడం కూడా ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ఈగల్ కార్యక్రమంతో పాటు పోలీసుశాఖ చేస్తున్న కృషిని గవర్నర్ అభినందించారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు, ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా విద్యార్థులను చైతన్యవంతం చేయడం మంచి ప్రయత్నమన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో మాదక, హానికర పదార్థాల లభ్యతను నియంత్రించడంతో పాటు చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

**యువతే దేశానికి బలం..**

యువతలోని శక్తి, ప్రతిభ, కలలే దేశానికి అతిపెద్ద సంపద అని గవర్నర్ అన్నారు. వాటిని మాదకద్రవ్యాలకు బలి చేయొద్దని విద్యార్థులకు సూచించారు. స్వామి వివేకానంద సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్షణిక ఆకర్షణలకు లోనై యువత తమ జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, విచక్షణ, ఆత్మ నియంత్రణను జీవితానికి మార్గదర్శకంగా చేసుకోవాలని సూచించారు. మిత్రుల్లో ఎవరైనా నషా వైపు వెళ్తున్నట్లు గుర్తిస్తే వారిని ఒంటరిగా వదిలేయకుండా మార్గదర్శనం చేసి సరైన దారిలోకి తీసుకురావాలని అన్నారు. 'నశాకు నో.. జీవితానికి ఎస్' అనే నినాదం కేవలం నినాదంగా కాకుండా ప్రతి యువకుడి జీవిత సంకల్పంగా మారాలని ఆకాంక్షించారు.

**తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే కీలక పాత్ర..**

పిల్లలతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం సంభాషిస్తూ నమ్మకం, ఆప్యాయతతో వ్యవహరించాలని గవర్నర్ సూచించారు. యువత, కుటుంబాలు, విద్యాసంస్థలు, స్థానిక సమాజం సమన్వయంతో పని చేస్తే మాదకద్రవ్యాల వంటి సామాజిక సమస్యలను సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. నశా ముక్త సమాజ నిర్మాణంలో పోలీస్, ప్రభుత్వ యంత్రాంగం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, ప్రజలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ పోలీసులు చేపడుతున్న విస్తృత అవగాహన కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు.

**నిజామాబాద్ మరింత అభివృద్ధి చెందాలి..**

నిజామాబాద్ గొప్ప చరిత్ర, సంస్కృతి, సాహిత్య వారసత్వానికి ప్రతీక అని గవర్నర్ అన్నారు. వ్యవసాయం, విద్య, పరిశ్రమలు, సమగ్ర అభివృద్ధి రంగాల్లో నిజామాబాద్ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రతి పాఠశాల సురక్షితంగా, ప్రతి యువత చైతన్యవంతంగా, ప్రతి కుటుంబం నశా దుష్ప్రభావాల నుంచి రక్షితంగా ఉండేలా సమాజం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన యువతే బలమైన సమాజాన్ని నిర్మిస్తుందని, బలమైన సమాజమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేస్తుందని పేర్కొన్నారు.

**నషాతో సర్వనాశనమే: ఎంపీ అరవింద్**

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ.. నషాతో అంతా సర్వనాశనమేనని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. అంతకుముందు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లక్ష మంది సంతకాలు చేసిన యాంటీ డ్రగ్ అవగాహన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. విద్యార్థులు, యువతతో నషా ముక్త్ ప్రతిజ్ఞ చేయించారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్, నగర మేయర్ ఉమారాణి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పి.రాకేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన కలెక్టర్



**నల్గొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వన మహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామము మరియు పట్టణాలలో మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 25వ తేదీ నుండి ప్రారంభమైన వన మహోత్సవంలో భాగంగా మంగళవారం నల్గొండ జిల్లా, నల్గొండ మండలం, గుండ్లపల్లి గ్రామంలో రహదారికి ఇరువైపులా 800 మొక్కలు నాటగా, ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవం కింద జిల్లాలో ఈ సంవత్సరం 57 లక్షల 70వేల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, ఇప్పటివరకు దాదాపు 60 శాతం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేశామని, తక్కిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం వనమహోత్సవం కింద రాష్ట్రవ్యాప్తంగా సామూహికంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని,ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామపంచాయతీలలో మొక్కలు నాటడం జరుగుతున్నదని, అన్ని ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, స్థలం ఉన్న ప్రతి చోట మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడ తుంపర వర్షాలు కురుస్తున్నందున దీన్ని సద్వినియోగం చేసుకొని మొక్కలు నాటాలని, జిల్లాకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాన్ని సాధించాలని చెప్పారు. నాటిన ప్రతి మొక్కకు నిరంతరం నీరందించాలని, ఇందుకు గ్రామపంచాయతీ ట్రాక్టర్లను వినియోగించుకోవాలని, అవసరమైతే విబిజీరామ్ జీ కింద వాచర్ ను ఏర్పాటు చేసుకోవాలని, మొక్కలకు నీరు అందించేందుకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి.రమేష్,డి ఎఫ్ ఓ రాజశేఖర్, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్, ఫారెస్ట్ రేంజ్ అధికారి రవీందర్, ఉపసర్పంచ్ జే .కే .సతీష్, మాజీ జెడ్పిటిసిలు, గుమ్మల మోహన్ రెడ్డి, వంగురు లక్ష్మయ్య, కోదండపూర్ సర్పంచ్ రాణి వెంకన్న, ఎంపీడీఓ యాకూబ్, తదితరులు ఉన్నారు.



# దేవాదుల ప్రాజెక్టు భూ నిర్వాసితులపై మంత్రి ఉత్తమ్ కీలక ప్రకటన



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేవాదుల తెలంగాణలో ఒక చారిత్రాత్మక ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. 2008లో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నిర్మాణంలో ఆలస్యం అయిందని అన్నారు. ఒక ఏడాది కాలంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యాన్ని మా ప్రభుత్వం పెట్టుకుందన్నారు. ఇవాళ జల సౌదలో దేవాదుల ప్రాజెక్టుపై ఉన్నతాధికారులు, మంత్రులతో కలిసి సమీక్ష నిర్వహించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు భూ నిర్వాసితులకు కొంత పరిహారం ఇచ్చామని మిగతా వారికి త్వరగా అందజేస్తామన్నారు. అలాగే ఆర్ అండ్ ఆర్ , ఫారెస్టు ఇష్యూలపై కూడా పరిహారం అందించాలని ఈ సమీక్షలో చర్చించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పెషల్ ప్యాకేజీ కింద రూ. 6 వేల కోట్లు విడుదల చేయబోతున్నారన్నారు.

# 22ఏ ఉచ్చులో ప్రజల ఆస్తులు

**కుత్బుల్లాపూర్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ లో 22ఏ బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రికి రాత్రే లక్షలాది మంది ప్రజల రిజిస్టర్డ్ ఆస్తులను, పట్టా భూములను 22ఏ లో చేర్చి సామాన్యులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తప్పు చేసింది ప్రభుత్వమైతే, దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగాల్సింది ప్రజలా అని నిలదీశారు. ప్రభుత్వ పెద్దల స్వార్థం, రియల్ ఎస్టేట్ వ్యాపార ప్రయోజనాల కోసమే ఈ 22ఏ దందా నడుస్తోందని, ప్రజల రక్తాన్ని పిండుతున్న తుగ్లక్ పాలన రాష్ట్రంలో సాగుతోందని ఆరోపించారు.

**ఒక్క నగరానికే పరిమితం కాదు**

కుత్బుల్లాపూర్ లోని పద్మారావు నగర్, స్ప్రింగ్‌ఫీల్డ్, రుక్మిణి ఎస్టేట్స్, నిజాంపేట్, బాచుపల్లి, గాజులరామారం వంటి పాత కాలనీలతో పాటు ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం, యాదాద్రి జిల్లా చల్లూరు తదితర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్ల నాటి పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టడం దుర్మార్గమని హరీశ్‌రావు పేర్కొన్నారు. 98 శాతం సమస్య పరిష్కారమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని, క్షేత్రస్థాయిలో వేలాది మంది బాధితులు లబోదిబోమంటున్నారని చెప్పారు. నిబంధనల ప్రకారం ఉన్న లేఅవుట్లను సైతం ఈ జాబితాలోకి నెట్టి, కమీషన్ల కోసం బ్రోకర్లను రంగంలోకి దించారని ఆరోపించారు. ఒక్కో ప్లాట్‌కు, విల్లాకు ఇంత చొప్పున వసూలు చేస్తేనే జాబితా నుంచి తొలగిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**భూ భారతిని... భూ మేతగా మార్చారు**

కేసీఆర్ హయాంలో భూముల విలువ పెరిగి ప్రజలకు ఆర్థిక భరోసా దక్కితే, రేవంత్ రెడ్డి పాలనలో ఒకవైపు హైడ్రా, మరోవైపు 22ఏ పేరుతో ప్రజల ఆస్తుల విలువను నేలమట్టం చేశారని విమర్శించారు. పేదలు తమ పిల్లల పెళ్లిళ్లు, వైద్యం, చదువుల కోసం దాచుకున్న చిన్న చిన్న స్థలాలను అమ్ముకోలేని దుస్థితి కల్పించారన్నారు. ఒకవైపు ప్రభుత్వ, అసైన్డ్ భూములను పెద్దలకు కట్టబెడుతూ, మరోవైపు సామాన్యుల ఆస్తులపై కబ్జాదారుల మాదిరిగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ధరణిని రద్దు చేస్తామని చెప్పి, 'భూభారతి' పేరుతో భూమేతగా మార్చి ప్రజల జీవితాలను ఆగం చేశారని ఎద్దేవా చేశారు.

**సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి..**

ఈ వ్యవహారంపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, 22ఏ జాబితా వివరాలను బహిరంగంగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖలో జరుగుతున్న అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ప్రజా సమస్య పరిష్కారం కాకపోతే సభను స్తంభింపజేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. బాధితులు ఎవరూ దళారులను నమ్మి కమీషన్లు ఇవ్వవద్దని, న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ సంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ వ్యాఖ్యలు అర్థరహితం

**ఢిల్లీ:** అమెరికా పర్యటనపై సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఇవాళ ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ అనుమతి రాకుండానే ఆదరాబాదరాగా అమెరికా పర్యటన పెట్టుకున్నారని కామెంట్ చేశారు. అమెరికా పర్యటనలో అర్హతలేని వ్యక్తులను కలవాలని రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నారని ఆరోపించారు. 2005లో గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్ర మోడీ అమెరికా పర్యటనను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుందని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో అమెరికా, లండన్, ఇతర దేశాల పర్యటనలకు కేంద్రం అనుతినిచ్చిందని పేర్కొన్నారు. కానీ, ఈసారి మాత్రం స్పష్టమైన.. పరిపాలనాపరమైన కారణాల వల్లే విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వలేదని కిషన్ రెడ్డి తెలిపారు.సీఎం సా-ధ్యిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పటికే అమెరికా పర్యటనపై ఆయన స్పష్టతనివ్వలేదని ఫైర్ అయ్యారు. గతంలో చాలామంది సీఎంలకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతినివ్వని రోజులు ఉన్నాయని గుర్తు చేశారు. విదేశాల్లో మన సీఎంలు ఎవరిని కలుస్తారు.. వాటితో దేశానికి ఏం ప్రయోజనం అనేది భారత విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని.. అనుమతులు ఇస్తుందని తెలిపారు. పాకిస్తాన్ కు అనుకూల వ్యక్తి, ఇండియాపై నిత్యం విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ అని ధ్వజమెత్తారు. భారత ప్రధాని మోడీని ఉగ్రవాదితో పోల్చిన వ్యక్తి ఇదే మమ్దానీ కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూయార్క్‌లో హిందువుల పండుగలపై ఆంక్షలు పెట్టిన వ్యక్తితో సీఎం రేవంత్ రెడ్డి భేటీలు ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి తన సా-ధ్యికి తగిన వారితో చర్చించాలని.. విదేశాలను తాను వెళ్లకుండా కూడా అధికారుల బృందాన్ని పంపి పెట్టుబడులు సాధించవచ్చని కిషన్ రెడ్డి అన్నారు.

**సింగరేణి ఇబ్బందుల్లో ఉంది..**

సింగరేణి సంస్థ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని, చివరికి ఉద్యోగులకు జీతాలు చెల్లించాలన్నా ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థకు తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.55 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.

## సంపాదకీయం

# కేబినెట్ ప్రక్షాళన ఎవరి కోసం?

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. శ్రావణమాసంలోనే మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు చేపట్టేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నదనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఒకరిద్దరు మంత్రులను తప్పించి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించడం, కొందరు మంత్రుల శాఖలను మార్చడం, సామాజిక--ప్రాంతీయ సమతుల్యతను పునరుద్ధరించడం వంటి అంశాలు పరిశీలనలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. అయితే ఈ వ్యవహారాన్ని కేవలం పాలనా మార్పుగా చూడలేం. దీని వెనుక పార్టీ అంతర్గత సమీకరణాలు, నాయకత్వంపై విశ్వాసం, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, భవిష్యత్ రాజకీయ వ్యూహం వంటి అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి.ప్రస్తుతం కేబినెట్ ప్రక్షాళన చర్చలో కొండా సురేఖ అంశం ప్రత్యేకంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఆమె కుటుంబానికి సంబంధించిన రాజకీయ పరిణామాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై వచ్చిన విమర్శలు కాంగ్రెస్‌లో అంతర్గత చర్చకు దారితీశాయి. పార్టీ ఎమ్మెల్యేల నుంచి వచ్చిన ఫిర్యాదులు, క్రమశిక్షణ సంఘం నివేదిక, పీసీసీ అభిప్రాయం వంటి అంశాల ఆధారంగా అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం ఉంది. అయితే ఇక్కడ కాంగ్రెస్ ముందున్న అసలు సమస్య ఒక్క మంత్రి విషయంలో నిర్ణయం తీసుకోవడం కాదు. ఆ నిర్ణయానికి రాజకీయంగా ఎలాంటి అర్థం వస్తుంది? అన్నదే కీలకం.ఒకవేళ కొండా సురేఖను మాత్రమే కేబినెట్ నుంచి తప్పిస్తే, అది వ్యక్తిగత లేదా కుటుంబ వివాదానికి సంబంధించిన చర్యగా ప్రతిపక్షాలు ప్రచారం చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మహిళా ప్రాతినిధ్యం, బీసీ సామాజిక వర్గం వంటి అంశాలు రాజకీయ చర్చలోకి వస్తే అధికార కాంగ్రెస్‌కు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆమె కుటుంబ సభ్యుల నుంచి ముఖ్యమంత్రిపై వచ్చిన విమర్శలకు ప్రతీకారంగానే మంత్రి పదవి తొలగించారనే ఆరోపణలు కూడా రావచ్చు. ఈ పరిస్థితి పార్టీకి అనవసరమైన రాజకీయ ఇబ్బందులను తెచ్చే అవకాశం ఉంది. అందుకే ఒక వ్యక్తిని మాత్రమే లక్ష్యంగా చేసుకున్న చర్యగా కాకుండా, మొత్తం కేబినెట్ పనితీరును సమీక్షించి అవసరమైన మార్పులు చేయాలనే వ్యూహం ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇక్కడే కేబినెట్ రిషఫ్లింగ్ అసలు రాజకీయ ప్రయోజనం కనిపిస్తోంది. పలువురు మంత్రుల పనితీరును సమీక్షించి, అవసరమైన చోట మార్పులు చేయడం ద్వారా ప్రభుత్వం ఒక విస్తృతమైన పాలనా ప్రక్షాళన చేపట్టిందనే సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చు. ఒకరిని మాత్రమే తప్పిస్తే వ్యక్తిగత వివాదంగా కనిపించే అంశం.. పలువురి శాఖల్లో మార్పులు, కొత్తవారికి అవకాశం కల్పించడం ద్వారా పరిపాలనా సంస్కరణగా చూపించే అవకాశం ఉంటుంది. అయితే ఈ మార్పులకు స్పష్టమైన కారణాలు లేకపోతే మాత్రం కొత్త అనుమానాలు తలెత్తే ప్రమాదం ఉంది.మంత్రుల శాఖల మార్పు కూడా ఈ నేపథ్యంలో కీలకంగా మారుతోంది. కొన్ని శాఖలకు సంబంధించి అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇవి ఆరోపణలు మాత్రమేనని, నిర్ధారణకు ముందే వాస్తవాలుగా పరిగణించడం సరికాదని గుర్తుంచుకోవాలి. అయితే ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించకూడదు. అవసరమైతే విచారణ జరిపించి వాస్తవాలను బయటపెట్టాలి. శాఖల మార్పు జరిగితే దాని వెనుక ఉన్న పరిపాలనా కారణాలను కూడా స్పష్టంగా వివరించాల్సి ఉంటుంది. లేకపోతే శాఖ మార్పునే ఆరోపణలకు పరోక్ష అంగీకారంగా ప్రతిపక్షాలు ప్రచారం చేసే అవకాశం ఉంది.మరోవైపు మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయడం కాంగ్రెస్‌కు అంత తేలికైన వ్యవహారం కాదు. మంత్రి పదవి ఆశిస్తున్న ఎమ్మెల్యేల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు ప్రతి నిర్ణయం ఒక రాజకీయ సందేశాన్ని ఇస్తుంది. ఒకరికి అవకాశం ఇస్తే మరొకరు అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉంటుంది. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయం తీసుకుంటే ఆయా వర్గాల్లో అసంతృప్తి తలెత్తవచ్చు. ప్రాంతీయ సమతుల్యత కూడా మరో కీలక అంశం. ఒక జిల్లాకు అధిక ప్రాధాన్యం లభిస్తే మరో ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం కోసం డిమాండ్లు రావచ్చు.ఈ నేపథ్యంలో మున్నూరు కాపు, ఓసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే చర్చకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడుతోంది. అయితే కేవలం సామాజిక సమీకరణాలే కాకుండా పార్టీ విధేయత, ఎన్నికల సమయంలో చేసిన కృషి, నియోజకవర్గంలో నాయకుడి ప్రభావం, పరిపాలనా సామర్థ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. మంత్రివర్గ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణలో అసలు సవాలు ఇదే. అందరినీ సంతృప్తిపరచడం సాధ్యం కానప్పుడు.. అసంతృప్తిని ఎంతవరకు నియంత్రించగలమన్నదే అధిష్ఠానం ముందున్న ప్రశ్న.వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు కూడా ఈ రాజకీయ పరిణామాలకు కీలక వేదికగా మారే అవకాశం ఉంది. సమావేశాలకు ముందు కేబినెట్ మార్పులు జరిగితే కొత్త మంత్రులతో ప్రభుత్వం సభను ఎదుర్కొంటుంది. సమావేశాల తర్వాత మార్పులు జరిగితే వాటిని ప్రత్యేక రాజకీయ నిర్ణయంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. అదే సమయంలో పెండింగ్‌లో ఉన్న డిప్యూటీ స్పీకర్ ఎన్నికను కూడా పూర్తి చేయాలనే ఆలోచన ఉంటే, కేబినెట్ మార్పులతో పాటు శాసనసభలోనూ కీలక సమీకరణాలను సర్దుబాటు చేసే ప్రయత్నంగా దీన్ని చూడవచ్చు.అయితే కేబినెట్ నుంచి తప్పించే మంత్రుల విషయంలో కాంగ్రెస్‌కు మరో పెద్ద సవాలు ఎదురుకానుంది. పదవి కోల్పోయిన నాయకులు పార్టీతో సమన్వయంగా కొనసాగుతారా? లేక ప్రభుత్వంపై బహిరంగ విమర్శలకు దిగుతారా? అన్నది ముఖ్యమైన ప్రశ్న. అధికారంలో ఉన్నప్పుడు అసంతృప్తిగా ఉన్న నాయకుడు పదవి కోల్పోయిన తర్వాత మరింత స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితి ఏర్పడితే ప్రతిపక్షాలకు అది రాజకీయ ఆయుధంగా మారుతుంది. ముఖ్యంగా ప్రభుత్వంలో ఉన్న అంతర్గత విభేదాలు బహిరంగమైతే ప్రజల్లో ప్రభుత్వ స్థిరత్వంపై కూడా ప్రశ్నలు తలెత్తవచ్చు.అందువల్ల కేబినెట్ ప్రక్షాళనకు ముందు ఎంత వ్యూహం అవసరమో, తర్వాత అంతకంటే ఎక్కువ వ్యూహం అవసరం. పదవి కోల్పోయే నాయకులను ఎలా సమన్వయం చేయాలి? అసంతృప్త ఎమ్మెల్యేలను ఎలా బుజ్జగించాలి? కొత్తగా మంత్రి పదవులు పొందని ఆశావహులకు ఏ బాధ్యతలు అప్పగించాలి? పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడే పరిస్థితి ఏర్పడకుండా రాజకీయ నిర్వహణ ఎలా చేయాలి? వంటి అంశాలపై కూడా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి పెట్టాల్సి ఉంటుంది.ఇదంతా చూస్తే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి కూడా ఒక కీలక పరీక్ష. తన ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడానికి సరైన బృందాన్ని ఎంపిక చేయడం ఒకవైపు.. పార్టీలో అసంతృప్తి పెరగకుండా చూసుకోవడం మరోవైపు. ముఖ్యమంత్రి తన రాజకీయ ప్రాధాన్యతలను, పరిపాలనా అవసరాలను అధిష్ఠానానికి వివరించాల్సి ఉంటుంది. అదే సమయంలో అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలను రాష్ట్ర నాయకత్వం సమర్థంగా అమలు చేయాల్సి ఉంటుంది.మొత్తంగా చూస్తే తెలంగాణ కాంగ్రెస్‌లో కేబినెట్ ప్రక్షాళన కేవలం మంత్రుల మార్పిడి వ్యవహారం కాదు. ఇది అధికార పార్టీ భవిష్యత్ రాజకీయ వ్యూహానికి ఒక కీలక సంకేతం. కొండా సురేఖ అంశం ఈ చర్చకు తక్షణ కారణంగా కనిపించినప్పటికీ, దాని పరిధి అంతకంటే విస్తృతంగా ఉండే అవకాశం ఉంది. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, మంత్రుల పనితీరు, పార్టీ క్రమశిక్షణ, ప్రభుత్వ ప్రతిష్ఠ, రాబోయే రాజకీయ సవాళ్లు.. అన్నింటినీ సమన్వయం చేస్తూ నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది.చివరికి కేబినెట్ ప్రక్షాళన ఎవరి పదవి ఉంటుందో, ఎవరి పదవి పోతుందో నిర్ణయించే ప్రక్రియగా మిగిలిపోకూడదు. అది ప్రభుత్వ పనితీరును మెరుగుపరిచే మార్పుగా కనిపించాలి. వ్యక్తిగత విభేదాలు, అంతర్గత రాజకీయాలు కాకుండా ప్రజా ప్రయోజనాలు, పరిపాలనా సామర్థ్యం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా నిర్ణయాలు తీసుకుంటేనే ఈ మార్పులకు విశ్వసనీయత వస్తుంది.కాంగ్రెస్ ముందున్న అసలు ప్రశ్న 'ఎవరిని మంత్రి చేయాలి? ఎవరిని తప్పించాలి?' అన్నది కాదు. 'ఎలాంటి బృందంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరింత సమర్థంగా పనిచేయగలదు?' అన్నదే. ఆ ప్రశ్నకు సమాధానంగా కేబినెట్ ప్రక్షాళన జరిగితే అది రాజకీయ మార్పు మాత్రమే కాకుండా పాలనా మార్పుకు కూడా నాంది కావచ్చు. లేకపోతే అంతర్గత విభేదాలను సర్దుబాటు చేసే మరో తాత్కాలిక ప్రయత్నంగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# ప్రజా సేవకు బదులు దందాగా మారకూడదు




ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, ప్రజలకు అవసరమైన సేవలను సులభంగా, వేగంగా అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన మీసేవ వ్యవస్థ తెలంగాణలో ప్రజా పరిపాలనలో ఒక కీలకమైన మార్పుగా నిలిచింది. ఒకప్పుడు ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం ఒక కార్యాలయం, జనన ధ్రువీకరణ పత్రం కోసం మరో కార్యాలయం, భూమికి సంబంధించిన రికార్డుల కోసం రెవెన్యూ కార్యాలయం అంటూ ప్రజలు రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను తగ్గిస్తూ వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా మీసేవ ప్రజలకు గణనీయమైన సౌకర్యాన్ని కల్పించింది.ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల నుంచి జనన, మరణ ధ్రువీకరణ పత్రాల వరకు.. భూముల రికార్డుల నుంచి విద్యా సంబంధిత ధ్రువీకరణ పత్రాల వరకు.. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, లీగల్ హెయిర్ వంటి సేవల నుంచి పలు ఇతర ప్రభుత్వ సేవల వరకు మీసేవ ప్రజల దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారింది. ఆధార్‌కు సంబంధించిన సేవలు, వివిధ ధ్రువీకరణ పత్రాలు, భూములకు సంబంధించిన ప్రక్రియలు వంటి వాటి కోసం ముందుగా ప్రజలకు గుర్తుకు వచ్చేది మీసేవ కేంద్రాలే.ఇంత విస్తృతమైన ప్రజా ప్రయోజన వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత కీలకం. కానీ మీసేవ కేంద్రాల్లో కొన్నిచోట్ల నిబంధనలకు విరుద్ధంగా అధిక రుసుములు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు, అర్హత లేని వ్యక్తులకు అనుకూలంగా ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు సహకరిస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. ఆరోపణలు నిజమైతే అవి కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన అక్రమంగా చూడలేం. ప్రభుత్వ సేవల పంపిణీ వ్యవస్థలోకి అవినీతి చొరబడినట్లుగా భావించాల్సి ఉంటుంది.

### సేవకు నిర్ణయించిన ధర.. వసూలు చేసేది మరొకటి

మీసేవ కేంద్రాల్లో అందించే ప్రతి సేవకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుము ఉంటుంది. ఆ రుసుము ఎంత అన్నది ప్రజలకు స్పష్టంగా తెలియాలి. సేవ కోసం ఎంత చెల్లించాలో ముందే తెలిసేలా ప్రతి కేంద్రంలో రుసుముల వివరాలను స్పష్టంగా ప్రదర్శించడం తప్పనిసరి చేయాలి. కానీ నిర్ణయించిన మొత్తానికి మించి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తే వాటిని ప్రభుత్వం తేలిగ్గా తీసుకోకూడదు.ఒక చిన్న మొత్తాన్ని అదనంగా వసూలు చేయడం కూడా ప్రజల దృష్టిలో చిన్న విషయం కాదు. ప్రభుత్వ సేవ ఉచితమా, రుసుముతోనా అనే విషయం పక్కన పెడితే.. నిర్ణయించిన రుసుముకంటే ఎక్కువ చెల్లించాల్సిందేనని ప్రజలను ఒత్తిడి చేసే పరిస్థితి ఏర్పడితే అది వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల విధానాలపై పూర్తి అవగాహన లేని ప్రజలు నిర్వాహకులు చెప్పిన మొత్తాన్నే చెల్లించే పరిస్థితి ఉండవచ్చు.అందుకే ప్రతి మీసేవ కేంద్రంలో సేవ పేరు, ప్రభుత్వం నిర్ణయించిన రుసుము, అవసరమైన పత్రాలు, సేవ అందించే గడువు, ఫిర్యాదు చేయాల్సిన అధికారుల వివరాలు స్పష్టంగా ప్రదర్శించాలి. ప్రజలకు సమాచారం ఉంటేనే వారు తమ హక్కును ప్రశ్నించగలరు.

### తప్పుడు ధ్రువీకరణ పత్రాల ఆరోపణలు మరింత తీవ్రమైనవి

అధిక రుసుముల వసూళ్ల కంటే ప్రమాదకరమైన విషయం తప్పుడు పత్రాలు, ఫోర్జరీ డాక్యుమెంట్ల ఆధారంగా ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు సహకరిస్తున్నారనే ఆరోపణలు. ఒక ధ్రువీకరణ పత్రం ఆధారంగా వ్యక్తికి ప్రభుత్వ పథకాలు, విద్యా అవకాశాలు, ఉద్యోగ ప్రయోజనాలు, భూమి సంబంధిత హక్కులు లేదా ఇతర ఆర్థిక ప్రయోజనాలు లభించే అవకాశం ఉంటుంది. అలాంటి పత్రం నిబంధనలకు విరుద్ధంగా జారీ అయితే దాని ప్రభావం ఒక్క వ్యక్తితో ఆగిపోదు.అర్హత లేని వ్యక్తికి అర్హత ఉన్నట్లుగా చూపించే పత్రం జారీ అయితే నిజంగా అర్హత ఉన్న వ్యక్తికి అన్యాయం జరిగే అవకాశం ఉంది. భూమి, వారసత్వం, పట్టా మార్పిడి వంటి అంశాల్లో తప్పుదారి పట్టించే పత్రాలు ఉపయోగిస్తే భవిష్యత్తులో కుటుంబాల మధ్య వివాదాలు, న్యాయపరమైన సమస్యలు కూడా తలెత్తవచ్చు.అందువల్ల ధ్రువీకరణ పత్రాల జారీలో మీసేవ నిర్వాహకుల పాత్ర ఎంతవరకు, సంబంధిత ప్రభుత్వ అధికారుల బాధ్యత ఎంతవరకు అన్నది స్పష్టంగా ఉండాలి. ఒక కేంద్రం నుంచి దరఖాస్తు స్వీకరించబడటం, ఆ తర్వాత ప్రభుత్వ శాఖ నుంచి ధ్రువీకరణ జరగడం వంటి ప్రక్రియల్లో ఎక్కడ లోపం ఏర్పడిందో గుర్తించే విధంగా డిజిటల్ ఆడిట్ వ్యవస్థను బలోపేతం చేయాలి.

### ఫిర్యాదు వస్తే.. విచారణ ఎక్కడ?

మీసేవ కేంద్రాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు అసలు పరీక్ష అధికార యంత్రాంగానిదే. ఫిర్యాదు స్వీకరించడం ఒక దశ మాత్రమే. దానిపై నిష్పాక్షికంగా విచారణ జరపడం, వాస్తవాలను నిర్ధారించడం, తప్పు రుజువైతే చర్యలు తీసుకోవడం తదుపరి దశలు.ఒకే కేంద్రంపై పదేపదే ఫిర్యాదులు వస్తున్నా ప్రతిసారీ అదే తరహాలో విచారణ జరిగి విషయం ముగిసిపోతే ప్రజల్లో అనుమానాలు తలెత్తడం సహజం. ఫిర్యాదుదారుడికి కూడా తన ఫిర్యాదుపై ఏం జరిగిందో తెలుసుకునే అవకాశం ఉండాలి. విచారణ ఫలితం ఏమిటి? తప్పు జరిగిందా? జరగలేదా? చర్య తీసుకున్నారా? వంటి విషయాల్లో పారదర్శకత అవసరం.ఫిర్యాదులను దాచిపెట్టడం వల్ల సమస్య పరిష్కారం కాదు. ఫిర్యాదుల మూలాన్ని గుర్తించి వ్యవస్థను సరిదిద్దడమే అసలు పరిష్కారం.

### అధికారుల పర్యవేక్షణ కీలకం

మీసేవ కేంద్రాలను నిర్వహించే ప్రైవేట్ నిర్వాహకులకు ప్రజా సేవలను అందించే బాధ్యత అప్పగించినప్పటికీ, వాటి పర్యవేక్షణ మాత్రం ప్రభుత్వ యంత్రాంగానిదే. కాబట్టి మీసేవ కేంద్రాల్లో ఏం జరుగుతుందో తెలుసుకునే బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుంది.కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, రుసుముల వసూళ్లను పరిశీలించడం, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించడం, పెండింగ్ దరఖాస్తులను పరిశీలించడం వంటి చర్యలు క్రమం తప్పకుండా జరగాలి. కేవలం రికార్డులు పరిశీలించి అంతా సక్రమంగా ఉందని భావించడం సరిపోదు. అవసరమైతే అధికారులు సాధారణ పౌరుల్లా సేవ పొందే విధానాన్ని పరిశీలించే విధంగా ఆకస్మిక తనిఖీలు కూడా చేపట్టాలి.అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏదైనా కేంద్రంలో అక్రమాలు కొనసాగుతున్నాయని నిర్ధారణ అయితే నిర్వాహకుడిపై చర్యతో పాటు పర్యవేక్షణలో విఫలమైన అధికారుల బాధ్యతను కూడా నిర్ణయించాలి. లేకపోతే చర్యలు తీసుకున్నా సమస్య మళ్లీ పునరావృతమయ్యే ప్రమాదం ఉంటుంది.

### మీసేవపై నమ్మకాన్ని కాపాడాలి

ప్రభుత్వ సేవల డిజిటలీకరణ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ప్రజలకు సౌకర్యం కల్పించడం. ఆ సౌకర్యం పేరుతో ప్రజలు మరో రకమైన మధ్యవర్తిత్వానికి బలైతే డిజిటల్ పాలన లక్ష్యం నెరవేరదు.మీసేవ కేంద్రం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక వారధిగా ఉండాలి. ఆ వారధి వద్ద ప్రజలను నిలిపివేసి అదనపు డబ్బులు వసూలు చేసే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లిస్తే ప్రభుత్వ సేవ పొందే హక్కు ప్రజలకు ఉంది. ఆ హక్కును ఎవరూ వ్యాపార అవకాశంగా మార్చుకోకూడదు.అదే సమయంలో మీసేవ కేంద్రాలన్నింటినీ అనుమానంతో చూడటం కూడా సరైనది కాదు. వేలాది కేంద్రాల్లో నిజాయితీగా సేవలందిస్తున్న నిర్వాహకులు ఉండవచ్చు. కొందరి అక్రమాల కారణంగా మొత్తం వ్యవస్థను తప్పుపట్టడం కంటే, తప్పు చేస్తున్న కేంద్రాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన మార్గం.

### ఫిర్యాదుల వ్యవస్థ బలోపేతం కావాలి

మీసేవ కేంద్రాల్లో అక్రమాలను అరికట్టడానికి మొదటి అవసరం సమర్థవంతమైన ఫిర్యాదు వ్యవస్థ. ప్రజలు ఫిర్యాదు చేయడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం, ఫిర్యాదుకు ప్రత్యేక నంబర్, విచారణ స్థితిని తెలుసుకునే సదుపాయం ఉండాలి.ఫిర్యాదు చేసిన వ్యక్తి సమస్య పరిష్కారమైందా లేదా అన్నది కూడా డిజిటల్‌గా తెలుసుకునే అవకాశం ఉంటే అధికారులపై కూడా బాధ్యత పెరుగుతుంది. ఫిర్యాదుల ఆధారంగా ఎక్కువగా సమస్యలు వస్తున్న కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించవచ్చు.అదేవిధంగా ప్రతి కేంద్రానికి సంబంధించిన సేవల సంఖ్య, తిరస్కరించిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఫిర్యాదుల సంఖ్య వంటి అంశాలపై పర్యవేక్షణ ఉంటే అక్రమాలకు అవకాశాలు తగ్గుతాయి.

### బాధ్యత నుంచి తప్పించుకునే అవకాశం ఉండకూడదు

ప్రజా సేవల విషయంలో బాధ్యత ఒకరి మీద మరొకరు నెట్టుకునే పరిస్థితి ఉండకూడదు. మీసేవ నిర్వాహకుడు ప్రభుత్వ శాఖను చూపడం, ప్రభుత్వ అధికారి మీసేవ కేంద్రాన్ని చూపడం ద్వారా సమస్యను పక్కకు నెట్టడం ప్రజలకు న్యాయం చేయదు.ఎక్కడ తప్పు జరిగిందో అక్కడే బాధ్యతను నిర్ణయించాలి. తప్పుడు పత్రం సమర్పించిన వ్యక్తి నుంచి దాన్ని పరిశీలించిన వ్యవస్థ వరకు ప్రతి దశను పరిశీలించాలి. కావాలనే నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తప్పకుండాలి. అదే సమయంలో ఆధారాలు లేకుండా ఆరోపణలు వచ్చిన ప్రతి సందర్భంలోనూ నిర్వాహకులను వేధించకుండా నిష్పాక్షిక విచారణ జరగాలి.

### ప్రజా సేవలో పారదర్శకతే ప్రాణం

మీసేవ అనేది కేవలం ఒక సర్టిఫికెట్ తీసుకునే కేంద్రం కాదు. అది ప్రభుత్వ పరిపాలన ప్రజలతో ఎలా వ్యవహరిస్తుందో చూపించే ఒక ముఖచిత్రం. అక్కడ ఒక పౌరుడికి ఎదురయ్యే అనుభవమే ప్రభుత్వంపై అతని అభిప్రాయాన్ని ప్రభావితం చేస్తుంది.ప్రభుత్వం ఎన్నో సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చినా, ప్రజలకు అవి అందించే చివరి దశలో అవినీతి, అధిక రుసుములు, అక్రమాలకు తావుంటే సంస్కరణల ప్రయోజనం పూర్తిగా ప్రజలకు చేరదు.కాబట్టి మీసేవ కేంద్రాలపై వచ్చే ఆరోపణలను ప్రభుత్వం రాజకీయ కోణంలో కాకుండా పరిపాలనా సంస్కరణల కోణంలో చూడాలి. ఎక్కడ తప్పు ఉందో అక్కడ చర్య తీసుకోవాలి. ఎక్కడ వ్యవస్థలో లోపం ఉందో అక్కడ మార్పు చేయాలి. ఎక్కడ పర్యవేక్షణ బలహీనంగా ఉందో అక్కడ బాధ్యతను పెంచాలి.ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటైన మీసేవ వ్యవస్థ.. ప్రజల నుంచి డబ్బు, సమయం, సహనం వసూలు చేసే మరో కార్యాలయంగా మారకూడదు. అది ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేసే నమ్మకమైన వేదికగా నిలవాలి.ప్రజల నమ్మకం ఒకసారి దెబ్బతింటే దాన్ని తిరిగి సాధించడం కష్టం. అందుకే ఆరోపణలు వచ్చినప్పుడే స్పందించడం కాదు.. అక్రమాలకు అవకాశం లేకుండా వ్యవస్థను ముందుగానే బలోపేతం చేయడం ప్రభుత్వ బాధ్యత. మీసేవలో పారదర్శకత పెరిగితే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం పెరుగుతుంది. జవాబుదారీతనం పెరిగితే అవినీతికి తలుపులు మూసుకుపోతాయి. అదే నిజమైన ప్రజా పాలనకు బాట.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# పట్టా తిప్పలు..

## నిషేధిత జాబితాలో రైతుల భూములు

**ధర్మసాగర్:** సాగుచేసేందుకు భూమి ఉంది.. కానీ రెవెన్యూ రికార్డుల్లో పట్టా లేదు. దీంతో 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా తయారైంది వేలేరు మండలంలోని పలు గ్రామాల్లోని రైతుల పరిస్థితి. అధికారుల తప్పిదాలతో సాగు భూములు నిషేధిత జాబితాలోకి చేరడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. సాగు భూములు ఉన్న ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. రైతు బంధు సహా సంక్షేమ పథకాలు అందక తీవ్రంగా నష్టపోతున్నామని కన్నీటిపర్యంతమవుతున్నారు. వేలేరు రెవెన్యూ పరిధిలోని పలు నీటి వనరుల కుంటలు, గ్రామకంఠం భూముల రికార్డుల పై సమగ్ర విచారణ జరపాలని రైతులు కోరుతున్నారు. కొందరు వ్యక్తులు బినామీ పేర్లతో ప్రభుత్వ భూములు, కుంటలను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు శాలపల్లి గ్రామానికి చెందిన కూరపాటి రమేష్, రైతుల తరపున వేలేరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో జరిగిన భూ శిస్తు, రికార్డు నిర్వహణలోని తప్పిదాలను పరిశీలించి అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. భూములు ఉండి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో పట్టా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలేరు మండలంలోని పలు గ్రామాల్లో భూ రికార్డుల్లో చోటుచేసుకున్న తప్పిదాలతో సాగు భూములు నిషేధిత జాబితాలోకి చేరాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతుబంధు సహా ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలు అందక తీవ్రంగా నష్టపోతున్నామని బాధిత రైతులు వాపోతున్నారు. గతంలో భూ శిస్తు చెల్లింపుల సమయంలో సర్వే నంబర్ల విషయంలో జరిగిన పొరపాట్లు, రికార్డుల తారుమారుతో సాగు భూములకు సంబంధించిన వివరాలు కుంటలు, ఇతర ప్రభుత్వ భూముల రికార్డులతో ముడిపడినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ప్రస్తుతం సాగు చేస్తున్న భూములపై హక్కులు ఉన్నప్పటికీ, అధికారిక రికార్డుల్లో మాత్రం స్పష్టత లేకపోవడంతో భూ లావాదేవీలు, పట్టాల మంజూరు వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. వేలేరు రెవెన్యూ పరిధిలోని పలు నీటి వనరుల కుంటలు, గ్రామకంఠం భూములకు సంబంధించిన రికార్డులపై కూడా సమగ్ర విచారణ జరపాలని రైతులు కోరుతున్నారు. కొందరు వ్యక్తులు బినామీ పేర్లతో ప్రభుత్వ భూములు, కుంటల భూములను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు శాలపల్లి గ్రామానికి చెందిన కూరపాటి రమేష్, రైతుల తరపున వేలేరు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తూ పాత రెవెన్యూ రికార్డులను పునఃపరిశీలించి వాస్తవ సాగుదారుల భూములను గుర్తించాలని కోరారు. గతంలో జరిగిన భూ శిస్తు, రికార్డు నిర్వహణలోని తప్పిదాలను పరిశీలించి, అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేయడంతో పాటు తప్పుగా నిషేధిత జాబితాలో చేర్చిన భూములను పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. పేద రైతుల భూములపై ప్రత్యేక దృష్టి సారించి రికార్డులను సరిచేయాలని, క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవ పరిస్థితులను గుర్తించాలని రైతులు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టి భూ రికార్డుల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# స్నాప్‌లో పరిచయం..

**ఆంధ్రప్రదేశ్ :** చనిపోతానంటూ బెదిరించి ఓ యువతి నుంచి విడతల వారీగా ఏకంగా రూ.1.38 కోట్లు వసూలు చేసిన వ్యక్తిపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు విజయవాడ సూర్యారావుపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, హైదరాబాద్‌లో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత యువతికి మద్దిశెట్టి గౌతంనాయుడు అనే యువకుడు స్నాప్‌చాట్ ద్వారా పరిచయమయ్యాడు. తాను ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినని, అమలాపురం సమీపంలోని అంబాజీపేట తన స్వగ్రామమని అతను ఆమెకు చెప్పినట్లు సమాచారం. పరిచయం పెరగడంతో ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ ఏడాది జూన్‌లో ఇద్దరూ కలిసి కోయంబత్తూరుకు కూడా వెళ్లినట్లు తెలుస్తోంది. కోయంబత్తూరులో ఉన్న సమయంలో గౌతంనాయుడు తాను ఆన్‌లైన్ క్రిప్టో కరెన్సీలో రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టానని, ఆ మొత్తం బ్లాక్ అయిందని యువతికి చెప్పాడు. అత్యవసరంగా డబ్బులు అవసరమని కోరడంతో ఆమె లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుని రూ.10.42 లక్షలు అతనికి ఇచ్చింది. ఆ తర్వాత కూడా డబ్బులు కావాలని గౌతంనాయుడు కోరగా, తన వద్ద ఇక డబ్బులు లేవని యువతి స్పష్టం చేసింది. దీంతో డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ అతను బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాకుండా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంటున్నట్లు ఫొటో తీసి వాట్సాప్‌లో పంపినట్లు తెలిపింది. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన యువతి ఈ విషయం తల్లికి కూడా చెప్పకుండా ఇంట్లోని బంగారు ఆభరణాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టింది. క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు తీసుకుని మరో రూ.1.27 కోట్లు గౌతంనాయుడికి ఇచ్చినట్లు సమాచారం. అయినప్పటికీ అతను మరిన్ని డబ్బులు కావాలంటూ బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. చివరకు వేధింపులు, బెదిరింపులు భరించలేక యువతి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువతి నుంచి నగదు ఏ విధంగా తీసుకున్నాడు, మొత్తం లావాదేవీల వివరాలు, నిందితుడి ఆర్థిక కార్యకలాపాలపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

# మెట్రో ఫేజ్-2లో కీలక ముందడుగు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ప్రాజెక్టు కోసం ఆయా ప్రభుత్వ శాఖల నుంచి కావాల్సిన ఎన్ఓసీల కోసం సమావేశం నిర్వహించిన ప్రభుత్వం ప్రాజెక్టు పనుల పర్యవేక్షణ కోసం జనరల్ కన్సల్టెంట్ల నియామకానికి కసరత్తు ప్రారంభించింది. దీనికి సంబంధించి ఈ నెల 19వ తేదీన ప్రీ బిడ్ సమావేశం సైతం నిర్వహించిన విషయం తెలిసిందే. రెండో దశలో ఏడు కారిడార్లలో నాలుగు కారిడార్లకు కలిపి ఒక జనరల్ కన్సల్టెంట్, మూడు కారిడార్లకు కలిపి మరో జనరల్ కన్సల్టెంట్ ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**రెండు జనరల్ కన్సల్టెంట్స్ కోసం**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో మెట్రో రెండో దశ ప నులను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు హెచ్ఎంఆర్ఎల్ చర్యలు వేగవంతం చేసింది. ప్రతిపాదిత కారిడార్లకు జనరల్ కన్సల్టెంట్లను త్వరగా ఎంపిక చేసి ప్రా జెక్టు పనులకు వేగం పెంచాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల నిర్వహించిన ప్రీ-బిడ్ సమావేశానికి 12 సంస్థలు హాజరయ్యాయి. మెట్రో రెండో దశలో మొత్తం ఏడు కారిడార్లను ప్రతిపాదించా రు. రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల ప్రాజెక్టులను చేపట్టడానికి అధికారులు ప్రతిపాదనలు రూ పొందించారు. నాలుగు మార్గాలకు సంబంధించిన జ నరల్ కన్సల్టెంట్ల నియామక ప్రక్రియను పూర్తి చే యాలని హెచ్ఎంఆర్ఎల్ నిర్ణయించింది. నాగోల్ -శంషాబాద్ ఎయిర్‌పోర్టు, రాయదుర్గ్ - కోకాపేట, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్ - హయత్‌నగర్ కారిడార్లు ఉన్నాయి. వీటిలో నాగోల్ - శం షాబాద్ మార్గం 36.8 కిలోమీటర్లు, రాయదుర్గ్ - కో కాపేట 11.6 కిలోమీటర్లు, ఎంజీబీఎస్-చాంద్రాయ ణగుట్ట 7.5 కిలోమీటర్లు, ఎల్బీనగర్--హయత్‌నగర్ 7.1 కిలోమీటర్లకు సంబంధించిన ఒక జనరల్ కన్స ల్టెంట్‌ను నియమించనున్నారు. మియాపూర్-పటాన్ చెరు 13.4 కి.మీ, జేబీఎస్ నుంచి మేడ్చల్ 24.5 కి.మీ, జేబీఎస్ నుంచి శామీర్‌పేట 22 కి.మీ మూడు కారిడార్లకు కలిపి మరో జనరల్ కన్సల్టెంట్‌ను నియమించాలని హెచ్ఎంఆర్ఎల్ నిర్ణయించింది.

**100 మార్కులతో..**

జనరల్ కన్సల్టెంట్ల ఎంపికలో క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలెక్షన్ విధానాన్ని అనుసరించాలని హెచ్ఎంఆర్ఎల్ నిర్ణయించింది. మొత్తం 100 మార్కులతో సంస్థలను అంచనా వేయాలని నిర్ణయించారు. గతంలో చేపట్టిన ప్రాజెక్టుల నాణ్యత, నిర్మాణంలో ఉపయోగించిన ముడి పదార్థాలు, పనుల పూర్తికి పట్టిన సమయం వంటి అంశాలకు 70 మార్కులు కేటాయించాలని, సంస్థలో పనిచేస్తున్న నిపుణుల ఆధారంగా మరో 30 శాతం మార్కులు కేటాయించాలని ప్రాతి సంస్థల సీవీలు, నిపుణుల అర్హతల ప్రాతిపదికన మరో 30 మార్కులు ఇవ్వాలని నిర్ణయించారు. క్వాలిటీపై అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు.

**త్వరలోనే ఫైనల్**

జనరల్ కన్సల్టెంట్ల నియామక ప్రక్రియను ప్రారంభించిన హెచ్ఎంఆర్ఎల్ వీలైనంత త్వరగా ఫైనల్ చేయాలని నిర్ణయించింది. అయితే ఇప్పటికే ఎంజీబీఎస్-చాంద్రాయన్ గుట్ట కారిడార్ కోసం జనరల్ కన్సల్టెన్సీ నియామకానికి హెచ్ఎంఆర్ఎల్ టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. అయితే ఒకే ఏజెన్సీ టెండర్ దాఖలు చేయడంతో రద్దు చేశారు. ఒకే కారిడార్ కాకుండా నాలుగింటికి కలిపి ఒకటే ఉండేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంఆర్ఎల్ నిర్ణయించింది.

**అగ్రిమెంట్‌కు ఐఆర్ఎఫ్సీ రెన్యూవల్**

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్ఎఫ్సీ) ద్వారా గరిష్ఠంగా రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ కింద రుణం పొందేందుకు ఢిల్లీ లో మే 25వ తేదీన అగ్రిమెంట్ చేసుకున్న సంగ తి తెలిసిందే. అయితే ఈ అగ్రిమెంట్ గడువుతో నేటితో ముగియనుంది. అగ్రిమెంట్ డాక్యుమెం ట్‌కు ఐఆర్ఎఫ్సీ రెన్యూవల్ చేసింది. అంటే హై దరాబాద్ మెట్రోరైలు మొదటి దశ స్వాధీనానికి కావాల్సిన రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ కో సం ఐఆర్ఎఫ్సీ రెడీగానే ఉందనడానికి నిదర్శ నం. అయితే ఈ ఒప్పంద పత్రాలపై ఐఆర్ఎఫ్సీ సీఎండీ, సీఈఓ మనోజ్ కుమార్ దుబే, తెలంగా ణ ప్రభుత్వ అప్పటి ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సంతకాలు చేసిన విషయం విధితమే.

# సీఎం వల్ల దేశ భద్రతకు ముప్పు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహార శైలి రాష్ట్ర శాంతిభద్రతలకే కాకుండా దేశ భద్రతకు కూడా ముప్పుగా మారిందని ఆయన ఆరోపించారు. మంగళవారం ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన అర్వింద్, సీఎం రేవంత్ విదేశీ పర్యటనలు, పరిపాలనా తీరుపై పలు సంచలన వ్యాఖ్యలు చేశారు.

**దేశ వ్యతిరేక శక్తులతో సంబంధాలు:**

విదేశాలలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడేందుకు దేశ వ్యతిరేక శక్తులు మాత్రమే ఉన్నాయా అని అర్వింద్ ప్రశ్నించారు. సీఎం విదేశీ పర్యటనల్లో దేశంపై విషం చిమ్మే వారితో చేతులు కలుపుతున్నారని, ఇక్కడ చిచ్చు రగిలించి రాజకీయ లబ్ధి పొందడమే ఆయన లక్ష్యమని ధ్వజమెత్తారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని తాను గతంలోనే చెప్పానని గుర్తుచేసిన అర్వింద్, ఇకపై రేవంత్ ప్రతీ కదలిక జాతీయ భద్రతా సంస్థల స్కాన్ కింద ఉంటుందని వ్యాఖ్యానించారు.

**ఉన్న వాటికే దిక్కులేదు..**

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక విద్యాసంస్థలు మూతపడే పరిస్థితికి వచ్చాయని అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన బకాయిలను క్లియర్ చేసి, రెగ్యులర్‌గా విడుదల చేస్తామని రాహుల్ గాంధీతో హామీ ఇప్పించి, ఇప్పుడు ఆ హామీని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉన్న విద్యా సంస్థలను నాశనం పట్టిస్తూ విదేశాల నుంచి ఏ విద్యాసంస్థలను తీసుకొస్తారని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చెబుతున్నవన్నీ పనికిమాలిన కథలని



కొట్టిపారేశారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాదని తెలంగాణ ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారన్నారు.

# రేషన్ డీలర్ల అక్రమ దందా

## వేలు పెట్టు.. డబ్బు పట్టు..




**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** చేసేదేమీ లేక లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని సదరు డీలర్‌కు విక్రయించడం సర్వసాధారణంగా మారింది. ఇలా ఎగువ మధ్యతరగతి రేషన్ లబ్ధిదారులే టార్గెట్ గా కొందరు రేషన్ డీలర్లు అక్రమార్జనకు నడుం కట్టారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తుండటంతో మూడు నెలల కోటా కాస్త.. రేషన్ డీలర్లు.. అక్రమార్కుల గల్లపెట్టే నిండుగా వ్యాపారం సాగుతోంది. సిద్దిపేట జిల్లాలో 3,36,869 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఉన్నాయి. అందులో 18,34 అంత్యోదయ ఫుడ్ సెక్యూరిటీ కార్డులు, 81 అన్నపూర్ణ కార్డుల ద్వారా మొత్తం 10,48,536 మంది లబ్దిదారులు ఉన్నారు. జిల్లా పరిధిలోని 685 రేషన్ షాపుల ద్వారా ఒక్క లబ్ది దారునికి నెలకు 6 కిలోల చొప్పున సాధారణంగా పంపిణీ చేస్తారు. ఈ సారి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన కోటా మొత్తం కలుపు కొని ఒక్క లబ్దిదారునికి 18 కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 19,957 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది.

**దళారులు టూ మిల్లర్లకు..**

జిల్లాలో కొన్ని రైసు మిల్లులు ప్రధానంగా పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసే కార్యక్రమం మీదనే నడుస్తున్నాయి. ప్రభుత్వం సీఎంఆర్ కోసం ఇచ్చిన ధాన్యాన్ని బయట మార్కెట్ లో అధిక ధరలకు విక్రయించినట్లు సమాచారం. ఈ క్రమంలో దళారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తమ మిల్లు పేరుతో ఉన్న లేబుల్ బస్తాల్లో నింపి ఎఫ్‌సీఐకి మిల్లర్లు అందజేస్తున్నట్లు తెలుస్తోంది.

**అధికారుల అండదండలతో..**

రేషన్ బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్ దందాపై ఉక్కుపాదం మోపుతున్నామని పైకి చెబుతున్నా పౌరసరఫరాల శాఖ, పోలీసు అధికారులు లోపాయికారిగా అక్రమార్కులకు అండగా నిలుస్తున్న రన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం... జిల్లా సరిహద్దులు దాటుకుంటూ, రైస్ మిల్లుల్లో రి సైక్లింగ్ అవుతూ కోట్ల దందా గా మారిన వైనం పై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. జిల్లా జరుగుతున్న రేషన్ అక్రమ వ్యాపారం పై ఉన్నతాధికారులు ఏవిధమైన చర్యలు తీసుకుంటారో చూడాలి మరీ.

**సగం మందిది ఇదే పంతా..?**

పట్టణ ప్రాంతాల్లో సంగం వంతు రేషన్ డీలర్లు ఈ పాస్ మిషన్ లో లబ్ధిదారులతో వేలు ముద్ర వేయించుకొని డబ్బులు చెల్లిస్తున్నట్లు తెలుస్తుంది. ఉదాహరణకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని లాల్ కమాన్, భారత్ నగర్, మోహిని పుర తదితర ప్రాంతాల్లో, జిల్లా పరిధిలోని గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాక మున్సిపాలిటీలో ఎగువ మధ్యతరగతి కుటుంబాలు నివాసం ఉండే ప్రాంతాల్లోని రేషన్ డీలర్లు లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించి అక్రమార్కులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారత ప్రభుత్వ వెబ్‌సైట్లను లక్ష్యంగా చేసుకుని విదేశీ ఉగ్ర మూకల సాయంతో సైబర్ దాడులకు పాల్పడ్డ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ విచారణను తీవ్రతరం చేసింది. 'ఆపరేషన్ సిందూర్' సమయాన దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించేలా జరిగిన సైబర్ టెర్రరిజం కుట్రపై నమోదు చేసిన కేసు ఆధారంగా, దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లోని ఐదు ప్రధాన ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

**ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు..**

**రామగుండంలో విచారణ**

గుజరాత్ సైబర్ టెర్రరిజం కేసు (RC-01/2025/NIA/AMD) విచారణలో భాగంగా ఎన్ఐఏ బృందాలు కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొంది తెలంగాణలోని కరీంనగర్/పెద్దపల్లి జిల్లా రామగుండం, మహారాష్ట్రలోని పుణె జిల్లా జున్నార్, గుజరాత్‌లోని ఖేడా జిల్లా నడియాడ్, బీహార్‌లోని గోపాల్‌గంజ్, , ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఈ దాడులు చేపట్టాయి. ఈ సోదాల్లో భాగంగా తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రామగుండం అయోధ్యనగర్‌లో ఉన్న ఒక ఇంజనీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్ నివాసంపై ఎన్ఐఏ అధికారులు సడన్ రైడ్ చేశారు. ఉగ్రవాద ముఠాలు, హ్యాకర్లతో సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని సమీపంలోని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో సుదీర్ఘంగా విచారిస్తున్నారు.

**54 ప్రభుత్వ వెబ్‌సైట్లపై దాడుల కుట్ర.. డిజిటల్ పరికరాలు స్వాధీనం**

'ఆపరేషన్ సిందూర్' సమయంలో దేశ భద్రతకు




సంబంధించి కీలకమైన క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ , రక్షణ రంగ సేవలు, ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 54 అధికారిక వెబ్‌సైట్లను హ్యాక్ చేసేందుకు , డిస్ట్రిబ్యూటెడ్ డినైయల్-ఆఫ్-సర్వీస్ దాడులతో స్తంభింపజేసేందుకు నిందితులు తీవ్రంగా ప్రయత్నించినట్లు ఎన్ఐఏ తెలిపింది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడంతో పాటు సైబర్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఈ దాడులకు ప్లాన్ చేశారని వెల్లడించింది. ఈ కేసును మొదట గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ నమోదు చేయగా, దీని తీవ్రత దృష్ట్యా ఎన్ఐఏ స్వీకరించి దర్యాప్తు చేస్తోంది. సోదాల సందర్భంగా హ్యాకింగ్ కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలు, కీలక డాక్యుమెంట్లతో పాటు 3 ల్యాప్‌టాప్‌లు, 5 మొబైల్ ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లు , ఇతర డిజిటల్ డివైస్‌లను ఎన్ఐఏ సీజ్ చేసింది. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్ట్ చేయగా, వారితో సంబంధాలు నెరుపుతూ సాంకేతిక సాయం అందించిన అనుమానితుల జాబితా ఆధారంగా ఈ రైడ్స్ నిర్వహించారు. కేసులో తదుపరి విచారణ వేగంగా కొనసాగుతోందని అధికారులు స్పష్టం చేశారు.



# మల్కాజిగిరి పోలీసుల సరికొత్త ప్రయోగం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతి సారధ్యంలో సరికొత్తగా చేస్తున్న డ్రోన్ పెట్రోలింగ్‌తో పోకిరీలు, ఆకతాయిలు, నేరస్థులలో కలవరాన్ని రేపుతోంది. ప్రజలకు, శాంతి భద్రతలకు ఇబ్బందులు కలిగించే విధంగా నిర్మానుష్య ప్రదేశాలు, గల్లీలు, క్రైం హాట్ స్పాట్స్‌లలో రాత్రి సమయాలు, ఇతర వేళలను అడ్డాగా చేసుకుంటున్న వారిని పోలీసులు డ్రోన్ పెట్రోలింగ్‌తో భరతం పడుతున్నారు. ముఖ్యంగా బహిరంగంగా మద్యం సేవించే, నిర్మానుష్య ప్రాంతాల్లో మత్తు పదార్థాలు తీసుకునే, రాత్రి సమయాల్లో గల్లీలలో తిష్ట వేసి న్యూసెన్స్ చేసే, క్రైం హాట్ స్పాట్స్‌లలో అనుమానాస్పదంగా తిరిగే అల్లరి మూకలను డ్రోన్ పెట్రోలింగ్ ద్వారా గుర్తించడంతో పాటు వారి చేష్టలకు సంబంధించిన ఫొటోలను, విడియోలను చిత్రీకరించి వారిని కట్టడి చేస్తున్నారు. ఈ డ్రోన్ పెట్రోలింగ్ ఆధారాలతో పోకిరీలు, ఆకతాయిల చట్టవ్యతిరేక పనులను కోర్టు విచారణలో నిరూపిస్తుండడంతో పోకిరీలకు ఈ పెట్టి కేసులలో శిక్షలు ఖాయంగా మారింది. మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ డ్రోన్ పెట్రోలింగ్ ద్వారా నమోదు చేసిన 50 కేసులలో నిందితులకు పలు రోజుల జైలు శిక్షలు, భారీ జరిమానాలు, సామాజిక సేవ శిక్షలు పడ్డాయని పోలీసు అధికారులు తెలిపారు. రానున్న రోజులలో ఈ డ్రోన్ పెట్రోలింగ్‌ను మరింతగా ముమ్మరంగా నిర్వహించి పోకిరీలు, క్రిమినల్స్, సమయ నిబంధనలను పాటించకుండా వివాదాలకు కారణమవుతున్న వ్యాపారులపై నజర్ పెంచుతామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

# భారీగా నక్సల్స్ ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు సోమవారం భారీగా నక్సల్స్ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి.



**భద్రాద్రి కొత్తగూడెం, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** భేజీ పోలీస్ స్టేషన్ పరిధిలోని భండార్‌పదర్, మునుర్‌కొండ అటవీ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో ఎస్ఎల్ఆర్ రైఫిల్, 315 బోర్ తుపాకీ, మస్కెట్ రైఫిల్, బీజీఎల్ లాంచర్, గ్రెనేడ్లు, ఇతర సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. ఆయుధాల స్వాధీనం నేపథ్యంలో అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు మరింత విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి.

# మిలాద్ ఉన్ నబీ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి



**వలిగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని వలిగొండ మండలంలోని హిందూ, ముస్లిం మతపెద్దలు, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులతో మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. రవి హాజరై మిలాద్ ఉన్ నబీ పండుగను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సోదరభావం, పరస్పర గౌరవం, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మతపెద్దలు, ప్రజలను కోరారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడకుండా, పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. అలాగే ప్రజలందరు మతసామరస్యాన్ని పాటిస్తూ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఈ పీస్ కమిటీ సమావేశాన్ని వలిగొండ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ఏ. శ్రీకాంత్ రెడ్డి ఎస్సై ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో హిందూ, ముస్లిం మతపెద్దలు, సంబంధిత శాంతి కమిటీ సభ్యులు పాల్గొని, పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు.. 38 మంది పై కేసులు

**కామారెడ్డి, ఫ్లాష్ ఇండియా :** రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 38 మంది పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కాగా వారికి వారికి రూ. 40,700/- జరిమానా విధించగా మరో ఐదుగురికి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వాహనం నడిపే వ్యక్తితో పాటు ఇతర వాహనదారులు, ప్రయాణికుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేశారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన ఎమ్మెల్యే బిఎల్ఆర్**




**మిర్యాలగూడ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
మిర్యాలగూడ డివిజన్ అటవీ శాఖ మరియు మిర్యాలగూడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఆర్డిఓ రమణా రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మున్సిపాలిటీ, అటవీ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, వాటి పెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

# ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి




**మిర్యాలగూడ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్డిఎస్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎఫ్డిఎస్ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఆర్డిఓ రమణారెడ్డి కి మంగళవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎఫ్డిఎస్ జిల్లా అధ్యక్షులు పోతుగంటి కాశి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జి.ఓ. నెం. 97 ని తీసుకొని వచ్చింది. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే ఆలోచనను విరమించుకొని జి.ఓ. నెం. 97 ను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యావిధానాన్ని యథావిధిగా కొనసాగించాలని అన్నారు. పెండింగ్ ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల కాక సుమారు 14 లక్షల మంది విద్యార్థులు పై చదువుల కోసం, ఉద్యోగాల కోసం సర్టిఫికెట్లు అవసరం ఉన్నందున కాలేజీల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు అన్నారు. కావున సత్వరమే పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు.
ఈ కార్యక్రమంలో కిరణ్, పృధ్వి, మధు, మనోహర్, క్రాంతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో విద్య సామర్థ్యాలు పెంపొందించేలా... ఉపాధ్యాయులు కృషి చేయాలి





**నల్గొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
విద్యార్థులలో విద్య సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం అయన నల్గొండ జిల్లా, నల్గొండ మండలం, కంచనపల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతో పాటు, తెలుగు, ఇంగ్లీష్ లలో పదాలకు అర్థాలు తెలిసే విధంగా నేర్పించాలని, ప్రాథమిక స్థాయిలో కనీస విద్యా సామర్థ్యాలు పెంపొందినప్పుడే పై తరగతులకు వెళ్లిన సందర్భంలో విషయం సులభంగా అర్థమవుతుందని, ఈ విషయంపై ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. అలాగే కొత్త పదాలకు అర్థాలతో పాటు, చదవడం, రాయడం ప్రాక్టీస్ చేయించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ, యూనిఫామ్స్ గురించి అడిగారు. అందరికీ యూనిఫామ్ అందించడం జరుగుతుందని, యూనిఫాం వచ్చినవారు సరైన విధంగా ఉన్నది సరిచూసుకోవాలని, అవసరమైతే పాఠశాలలోనే ఆల్టరేషన్ చేయించేందుకు టైలర్లను పాఠశాలకు పిలిపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. స్థానిక సర్పంచ్ మహేశ్వరి తో మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపుదలకు తరచు పాఠశాలను సందర్శించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలను నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

## వన మహోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి

## విరివిగా మొక్కలు నాటాలి.. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అలాగే పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం, జనగామ మండలంలోని చౌడారం గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై, మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వన మహోత్సవ లక్ష్యాలను ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు వృక్షాలు ఎంతో కీలకమని పేర్కొంటూ "మొక్కలను నాటుదాం -- పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో గల ఖాళీ ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రహదారుల పక్కన, చెరువుల పరిసరాల్లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించి, విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. మొక్కలకు నీరు అందించడం, కంచెలు ఏర్పాటు చేయడం, పశువుల నుంచి రక్షించడం వంటి చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేశారు. వన మహోత్సవం కోసం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ భాస్కర్, అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ భాస్కర్, డీఏఓ అంబికా సోనీ, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, ఎంపీడీఓ మహేష్ నాయక్, సర్పంచ్ కె. పద్మ, ఉప సర్పంచ్ ప్రవీణ్, ఇతర సంబంధిత అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# 45 రోజుల్లో భూసేకరణ, ఆర్అండ్ఆర్ సమస్యలు పరిష్కరించాలి






**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి నిర్దేశిత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసం--పునరావాస పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్), అటవీ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. ప్రాజెక్టుల వారీగా అవసరమైన భూసేకరణ, పెండింగ్ ఆర్అండ్ఆర్ చెల్లింపులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. వచ్చే 45 రోజుల్లో అన్ని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, ఆర్అండ్ఆర్ సమస్యలను పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను చీఫ్ ఇంజినీర్లు సవాల్‌గా తీసుకుని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రాజెక్టుల కోసం ఇటీవల ముఖ్యమంత్రి ఆమోదంతో రూ. 2,800 కోట్ల నిధులు విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే రూ. 1,080 కోట్లు జిల్లా కలెక్టర్ల పీడీ ఖాతాలకు చేరాయని తెలిపారు. అవసరమైతే మరో రూ. 6 వేల కోట్లను ఒకేసారి విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అందుబాటులో ఉన్న నిధులను అర్హులైన లబ్ధిదారులకు త్వరగా అందించి, రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించిన అనంతరం భూములను సకాలంలో సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ సమస్యల్లో ఎలాంటి అవరోధాలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన భారీ నిధులను సద్వినియోగం చేసుకుని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. రైతులకు నష్టం కలగకుండా పరిహారం, పునరావాస చర్యలు పూర్తి చేసి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# జిల్లాలో వైద్య ఆరోగ్య సేవలపై అధికారుల తనిఖీలు





**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వాణిశ్రీ వనపర్తి, దేవరుప్పుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు, చిన్నమడూరు, పెద్దమడూరు, సింగరాజుపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య ఉప కేంద్రాలలో నిర్వహిస్తున్న మాతా శిశు కార్యక్రమాలు, టీకాల కార్యక్రమాలు, NCD కార్యక్రమాలు, TB కార్యక్రమాలు, కాలానుగుణ వ్యాధుల నియంత్రణ చర్యలు మరియు మందుల నిల్వలను పరిశీలించి, వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రతి గర్భిణీ స్త్రీని 12 వారాలలోపు నమోదు చేయాలని, 30 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికీ అసంక్రమిత వ్యాధుల (NCD) నివారణలో భాగంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రతి నెలా క్రమం తప్పకుండా మందులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా 0-15 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించాలని, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (HPV) నిరోధక టీకాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, కాలానుగుణ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

**ART సెంటర్ సందర్శన**

అనంతరం ఎయిడ్స్ కార్యక్రమం జాయింట్ డైరెక్టర్ డా. అనురాధ, జిల్లాలోని ART సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ART సెంటర్‌లో అందిస్తున్న వైద్య సేవలు, కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వాణిశ్రీ వనపర్తి, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. శ్రావ్య, డా. సిద్ధార్థ, ఝాన్సీ మాధురి, తదితరులు పాల్గొన్నారు.

**41వ నేత్రదాన పక్షోత్సవాల ప్రారంభం**

అదే విధంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జనగాం ఆధ్వర్యంలో జనగాం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 41వ నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్రదానం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేత్రదానం ద్వారా చూపును కోల్పోయిన వారికి దృష్టిని అందించే అవకాశం ఉన్నందున, నేత్రదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి పాల్గొన్నారు.



# ఎంఎస్ ధోనీ వద్దు..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కొత్త హెడ్ కోచ్ ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. 18 ఏళ్ల పాటు సీఎస్‌కేకు హెడ్ కోచ్‌గా సేవలందించిన న్యూజీలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వైదొలిగాడు. ఫ్లెమింగ్ స్థానాన్ని భర్తీ చేసే వ్యక్తి ఎవరనే చర్చ జోరుగా సాగుతోంది. ఇయాన్ మోర్గాన్, మైక్ హస్సీ వంటి దిగ్గజాల పేర్లు వినిపిస్తున్నప్పటికీ.. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్, సీఎస్‌కే మాజీ ఓపెనర్ మాథ్యూ హేడెన్ మాత్రం టీమిండియా స్టారే పర్ఫెక్ట్ కోచ్ అంటున్నాడు.సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్‌గా ప్రస్తుతం ఆర్‌సీబీ మెంటర్‌గా ఉన్న దినేశ్ కార్తీక్‌ను నియమించడమే సరైన ఎంపిక అని మాథ్యూ హేడెన్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా చెన్నైతో కార్తీక్‌కు ఉన్న అనుబంధం కారణంగా అతడు ఈ బాధ్యతకు సరైన వ్యక్తి అని పేర్కొన్నాడు. చెన్నైలో జన్మించిన కార్తీక్ తమిళనాడు తరఫున దేశవాళీ క్రికెట్ ఆడిన విషయాన్ని గుర్తుచేశాడు. 'హెడ్ కోచ్‌గా దినేశ్ కార్తీక్ పేరు కూడా వినిపిస్తోంది. ఇలాంటి బాధ్యతను చేపట్టడానికి డీకే సిద్ధంగా ఉన్నాడని నేను భావిస్తున్నాను. సీఎస్‌కే లాంటి ఫ్రాంచైజీకి లోకల్ టచ్ ఉండటం చాలా ముఖ్యం. అందుకే దినేశ్ కార్తీక్ పర్ఫెక్ట్ వ్యక్తి' అని హేడెన్ పేర్కొన్నాడు.అంతర్జాతీయ కోచ్‌లను నియమించుకోవడం కూడా తప్పు కాదని, అయితే సీఎస్‌కే వంటి జట్టుకు చెన్నైతో అనుబంధం ఉన్న వ్యక్తి హెడ్ కోచ్‌గా ఉంటే ప్రత్యేకమైన ప్రయోజనం ఉంటుందని హేడెన్ అభిప్రాయపడ్డాడు. అభిమానులు, జట్టు సంస్కృతి, ప్రాంతీయ వాతావరణంపై కార్తీక్‌కు మంచి అవగాహన ఉండటం అతడికి ప్లస్ పాయింట్‌గా మారుతుందని చెప్పాడు. కార్తీక్‌కు కోచింగ్, జట్టు నిర్వహణ విషయంలోనూ అనుభవం పెరిగిందని హేడెన్ చెప్పాడు. గత మూడు సంవత్సరాలుగా ఆర్‌సీబీ సపోర్ట్ స్టాఫ్‌లో భాగంగా ఉన్న కార్తీక్.. ఆ జట్టు వరుసగా 2025, 2026 ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన సమయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ అనుభవం సీఎస్‌కేకు ఉపయోగపడుతుందని హేడెన్ అభిప్రాయపడ్డాడు.కొత్త హెడ్ కోచ్ ఎంపిక విషయంలో సీఎస్‌కే చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని హేడెన్ సూచించాడు. స్టీఫెన్ ఫ్లెమింగ్, ఎంఎస్ ధోనీ కలయిక సీఎస్‌కేకు అపారమైన విజయాన్ని అందించిందని గుర్తుచేశాడు. వారి భాగస్వామ్యమే జట్టు విజయాల్లో కీలకమైన బలమైన వ్యవస్థగా నిలిచిందని పేర్కొన్నాడు. 'ఫ్లెమింగ్ సూపర్. అతడి పని తీరు బాగుంది. ఎంఎస్ ధోనీతో కలిసి ఆయన బలమైన వ్యవస్థను నిర్మించాడు. ముంబై ఇండియన్స్‌తో సమానంగా టైటిళ్లు సాధించే స్థాయికి జట్టును తీసుకెళ్లిన ఆ కాలం గొప్ప వారసత్వాన్ని మిగిల్చింది. ఇప్పుడు కొత్త కోచ్‌ను ఎంచుకోవడం ఒక సాహసోపేతమైన నిర్ణయం. ఫ్రాంచైజీ సరైన వ్యక్తిని ఎంపిక చేస్తుందని ఆశిస్తున్నాను' అని హేడెన్ పేర్కొన్నాడు.మరోవైపు సీఎస్‌కే భవిష్యత్తులో ఎంఎస్ ధోనీ పాత్ర ఏంటి? అన్నదీ కీలకంగా మారింది. 2026 ఐపీఎల్ సీజన్‌లో ధోనీ సీఎస్‌కే తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అయినప్పటికీ జట్టులో అతడి ప్రభావం మాత్రం కొనసాగుతోంది. కొత్త హెడ్ కోచ్ ఎంపికలో ధోనీ అభిప్రాయం కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. మొత్తంగా ఫ్లెమింగ్ స్థానాన్ని భర్తీ చేసేందుకు సీఎస్‌కే ముందు అనేక ఆప్షన్లు ఉన్నప్పటికీ.. మాథ్యూ హేడెన్ మాత్రం చెన్నైకి చెందిన కార్తీక్‌నే సరైన ఎంపికగా సూచిస్తున్నాడు. ఫ్రాంచైజీ చివరకు ఎవరిని ఎంపిక చేస్తుందో చూడాలి.

# రెండో టెస్టులో వాగ్వాదం..



భారత్, శ్రీలంక జట్ల మధ్య కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ లో సమయంలో యశస్వి జైస్వాల్, అసిథ ఫెర్నాండోలు వాగ్వాదం చేసుకున్నారు. వారి మధ్య గొడవకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. దీంతో మైదానంలో దురుసుగా ప్రవర్తించిన భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ , లంక పేసర్ అసిథ ఫెర్నాండోల పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. తొలి రోజు ఆటలో భారత్ బ్యాటింగ్ చేస్తున్న 17వ ఓవర్ ముగింపులో జైస్వాల్ అవుటైన తర్వాత ఇరువురు ఆటగాళ్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరూ ఒకరికొకరు అత్యంత సమీపంగా వచ్చి తలలు తాకించుకుంటూ ఘర్షణ పడటంతో వాతావరణం వేడెక్కింది.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.12 (లెవల్ 1 ఉల్లంఘన) కింద ఇద్దరు ఆటగాళ్లనూ దోషులుగా నిర్ధారించింది. ఈ క్రమంలో మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ విధించిన నిబంధనల ప్రకారం జైస్వాల్, అసిథ ఫెర్నాండోలకు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానాతో పాటు ఒక్కొక్క డీమెరిట్ పాయింట్‌ను కేటాయించారు. తాము చేసిన తప్పును ఇద్దరు ఆటగాళ్లు అంగీకరించడంతో ఎలాంటి అధికారిక విచారణ అవసరం లేకుండానే ఈ క్రమశిక్షణా చర్యలు అమల్లోకి వచ్చాయి.



# ఒక్కరోజే మూడు అరుదైన రికార్డులు..

శ్రీలంకతో కొలంబోలో జరుగుతున్న రెండో టెస్టులో హాఫ్ సెంచరీ బాదిన టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ అరుదైన రికార్డులు ఖాతాలో వేసుకున్నాడు. ఒకే రోజు ఏకంగా మూడు కీలక ఘనతలను అందుకుని తన పేరును రికార్డు పుస్తకాల్లో లిఖించుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో సిక్సర్ల పరంగా ఆడమ్ గిల్‌క్రిస్ట్‌ను అధిగమించడంతో పాటు డబ్ల్యూటీసీ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా శుభ్‌మన్ గిల్‌ను వెనక్కి నెట్టాడు. విదేశీ లేదా తటస్థ వేదికల్లో భారత వికెట్ కీపర్‌గా చేసిన పరుగుల్లోనూ ఎంఎస్ ధోనీ రికార్డును అధిగమించాడు.

**ఆడమ్ గిల్‌క్రిస్ట్‌ను అధిగమించి:**

రెండో టెస్టు రెండో రోజు రిషభ్ పంత్ 89 బంతుల్లో 63 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. ఈ సిక్సర్లతో టెస్టు క్రికెట్‌లో పంత్ మొత్తం సిక్సర్ల సంఖ్య 102కు చేరింది. దీంతో ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్‌ను అధిగమించి టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానానికి చేరుకున్నాడు. గిల్‌క్రిస్ట్ 96 టెస్టుల్లో 100 సిక్సర్లు కొట్టగా.. పంత్ కేవలం 52 టెస్టుల్లోనే 102 సిక్సర్లు బాదాడు. ఈ జాబితాలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ 138 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉండగా.. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ 107 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నాడు.

**శుభ్‌మన్ గిల్‌ను వెనక్కి నెట్టి:**


వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలోనూ రిషభ్ పంత్ సరికొత్త రికార్డు సృష్టించాడు. టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను వెనక్కి నెట్టి.. డబ్ల్యూటీసీ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. గిల్ 42 టెస్టుల్లో 2,917 పరుగులు చేయగా.. పంత్ 2,948 రన్స్ చేశాడు. డబ్ల్యూటీసీలో పంత్ 42 మ్యాచ్‌ల్లో 74 ఇన్నింగ్స్‌లు ఆడి 42.11 సగటుతో పరుగులు చేశాడు. అతడి ఖాతాలో ఆరు సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

**ఎంఎస్ ధోనీ రికార్డు బ్రేక్:**

విదేశీ లేదా తటస్థ వేదికల్లో భారత వికెట్ కీపర్‌గా అత్యధిక టెస్టు పరుగులు చేసిన ఆటగాడిగానూ రిషభ్ పంత్ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. ఎంఎస్ ధోనీ 48 టెస్టుల్లో 2,496 పరుగులు చేయగా.. పంత్ 2,534 పరుగులకు చేరుకున్నాడు. ఈ గణాంకాలతో పంత్ తన గురువు ధోనీని అధిగమించాడు. పంత్ ఇప్పటికే ఈ ఫార్మాట్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మూడు టెస్టుల్లో నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 249 పరుగులు చేశాడు. 62.25 సగటుతో బ్యాటింగ్ చేసిన అతడి స్ట్రైక్ రేట్ 73.02గా ఉంది. ఈ ఏడాది అతడి ఖాతాలో మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి.

# బిజినెస్

## ఎలక్ట్రానిక్స్‌లో భారత్ బిగ్ జంప్



భారత్ కేవలం ఎలక్ట్రానిక్ వస్తువులను అసెంబుల్ చేసే స్థాయి నుంచి, వాటికి కావలసిన స్పేర్ పార్ట్స్ సొంతంగా తయారు చేసే గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా అవతరిస్తోంది. కోటక్ మ్యూచువల్ ఫండ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, 2031 నాటికి దేశ మొత్తం ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల విలువను 500 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 48 లక్షల కోట్ల)కు చేర్చాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏంటంటే, ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీ ఏకంగా 14 రెట్లు పెరగనుంది. 2023-24లో రూ. 95.7 వేల కోట్లుగా ఉన్న విడిభాగాల ఉత్పత్తి, 2031 నాటికి రూ. 14.5 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. దేశీయంగా తయారయ్యే ఉత్పత్తుల్లో విడిభాగాల వాటానే రూ. 13.4 లక్షల కోట్లకు పెరగడం, భారత్ టెక్ స్వయంసమృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందనడానికి నిదర్శనమని నివేదిక అభిప్రాయపడింది.

**స్మార్ట్‌ఫోన్ల ఆధిపత్యం**

మరోవైపు, భారత ఎలక్ట్రానిక్స్ రంగంలో స్మార్ట్‌ఫోన్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించనున్నాయి. 2024లో రూ. 5 లక్షల కోట్లుగా ఉన్న మొబైల్ ఫోన్ల ఉత్పత్తి 2031 నాటికి మూడు రెట్లు పెరిగి రూ. 15.2 లక్షల కోట్లకు చేరనుంది. ఇతర విభాగాల్లోనూ, టీవీలు, ఆడియో ఉత్పత్తుల మార్కెట్ రూ. 1.25 లక్షల కోట్ల నుంచి రూ. 3.5 లక్షల కోట్లకు, ల్యాప్‌టాప్‌లు-టాబ్లెట్‌ల ఐటీ హార్డ్‌వేర్ రూ. 48 వేల కోట్ల నుంచి రూ. 3.06 లక్షల కోట్లకు వృద్ధి చెందనుంది. వీటితో పాటు స్మార్ట్‌వాచ్‌లు, ఇయర్‌బడ్స్ వంటి వేరబుల్స్ రంగం భారీగా పుంజుకుని రూ. 36.2 లక్షల కోట్లకు, ఆటో ఎలక్ట్రానిక్స్ రూ. 3.15 లక్షల కోట్లకు, టెలికాం పరికరాలు రూ. 1.43 లక్షల కోట్లకు చేరుకోనున్నాయి. మొబైల్స్‌తో పాటు కాంపోనెంట్లు, ఇతర ఎలక్ట్రానిక్ రంగాలు కూడా సమాంతరంగా అభివృద్ధి చెందడం వల్ల దేశంలో పెద్ద ఎత్తున ఉపాధి, విదేశీ పెట్టుబడులు రానున్నాయి.

# కొనుగోలు దారులకు రిలీఫ్..




ఐదురోజుల తర్వాత బంగారం ధరలు స్వల్ప ఊరటనిచ్చాయి. పెరిగేది కొండంత.. తగ్గేది గోరంత.. అన్నట్లుగానే ఉంది బంగారం పరిస్థితి. ఐదురోజులుగా వేల రూపాయల్లో పెరిగిన బంగారం ధర.. మంగళవారం వందల రూపాయల్లో మాత్రమే తగ్గింది. ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.220 మేర తగ్గి.. రూ.1,63,750కి దిగివచ్చింది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర రూ.200 మేర తగ్గి రూ.1,50,100కి చేరింది. ధర స్వల్పంగానే తగ్గినా పెద్దమొత్తంలో బంగారం కొనే వారికి కాస్త ఊరట లభిస్తుంది. పైగా శుభకార్యాలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో మార్కెట్లో బంగారం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మరోవైపు వెండి ధర కూడా ఊహించని విధంగా పతనమయింది. కిలో వెండి ధర రూ.10,000 మేర తగ్గింది. ప్రస్తుతం మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,65,000గా ఉంది.



# గ్యాస్ సిలిండర్ ధరలు

ఈ నెల(ఆగస్టు) 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించిన విషయం తెలిసిందే. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఈ రోజు(మంగళవారం) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. ఆగస్టు 25వ తేదీన తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.994.00గా, వరంగల్‌లో రూ.1013.00గా ఉంది. ఇక, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన విశాఖపట్నంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.950.00గా, విజయవాడలో రూ.966.50, గుంటూరులో రూ.966.50గా ఉంది.



# 2036 నాటికి దేశంలో 10.8 కోట్ల మంది సంపన్న కస్టమర్లు

భారత్ వినియోగదారుల మార్కెట్ రాబోయే పదేళ్లలో భారీగా మారనుంది. నీల్సన్‌ఐక్యూ, వరల్డ్ డేటా ల్యాబ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, 2036 నాటికి రోజుకు 90 డాలర్లు (సుమారు రూ. 8,600) కంటే ఎక్కువ ఖర్చు చేసే 'సంపన్న వినియోగదారుల' సంఖ్యలో భారత్ చైనాను దాటనుంది. 2026లో 2.6 కోట్లుగా ఉన్న ఈ వర్గంవారు, రాబోయే దశాబ్దంలో మరో 8.2 కోట్లు పెరిగి ఏకంగా 10.8 కోట్లకు చేరుతుందని అంచనా. అదే సమయంలో చైనాలో ఈ సంఖ్య 10.3 కోట్ల వద్దే ఆగిపోనుంది. అంతర్జాతీయంగా 23.1 కోట్ల మందితో అమెరికా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, అత్యంత వేగంగా సంపన్నుల సంఖ్య పెరుగుతున్న దేశంగా భారత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. దీనికి తోడు రోజుకు రూ. 1,200 నుండి రూ. 8,600 ఖర్చు చేసే 'ప్రధాన వినియోగదారుల' సంఖ్య కూడా దేశంలో 64.9 కోట్లకు చేరుతుందని నివేదిక తెలిపింది.

**'వాల్యూ ఫర్ మనీ'కి ప్రాధాన్యం**

ఈ భారీ మార్పు గ్లోబల్ బ్రాండ్లకు అపారమైన అవకాశాలను తెచ్చిపెడుతోంది. ప్రపంచ జనాభాతో పోలిస్తే సంపన్న వినియోగదారుల సంఖ్య తక్కువే అయినప్పటికీ, 2026 నాటికి గ్లోబల్ వ్యయంలో వీరి వాటా ఏకంగా రూ. 3,437.78 లక్షల కోట్లుగా ఉండనుంది. అందువల్లే కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రీమియం స్థాయికి అప్‌గ్రేడ్ చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. అయితే, 2021-2025 మధ్య వస్తువుల ధరలు 26 శాతం పెరగడంతో, కొనుగోలు శక్తి పెరిగినా 60 శాతం మంది భారతీయులు ఇప్పటికీ తాము పెట్టే డబ్బుకు సరిపడా నాణ్యత (వాల్యూ ఫర్ మనీ) ఉంటేనే కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రీమియం ధరలకు తగ్గ స్పష్టమైన ప్రయోజనం కనిపించకపోతే కస్టమర్లు చౌక ప్రత్యామ్నాయాలకు మారిపోతారని, అందుకే బ్రాండ్లు అందుబాటు ధరలు, ప్రీమియం క్వాలిటీ మధ్య సరైన సమతుల్యత పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# 19 ఏళ్ల తర్వాత




ఒకప్పటి స్టార్ హీరోయిన్ శ్రియా శరణ్ ప్రస్తుతం టాలీవుడ్‌లో వైవిధ్యమైన, బలమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. గతేడాది 'మిరాయ్' చిత్రంలో అంబిక ప్రజాపతిగా తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రియా, 'దృశ్యం-3' సినిమాలోనూ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ క్రమంలో ఆమె సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఒక ఫోటో ఇప్పుడు అభిమానుల్లోనూ పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో సూపర్ స్టార్ రజినీకాంత్‌తో కలిసి ఉన్న ఫోటోను పోస్ట్ చేసిన శ్రియా, దానికి హ్యాపీ డే అని క్యాప్షన్ ఇచ్చారు. ముఖ్యంగా ఆ ఫోటోలో రజినీకాంత్ తన తదుపరి చిత్రం 'ధర్మన్' గెటప్‌లో ఉండటం విశేషం. దీనితో శ్రియా శరణ్ ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగమైనట్లు వార్తలు జోరందుకున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో రజినీకాంత్‌తో కలిసి శ్రియా శరణ్ స్పెషల్ సాంగ్‌లో స్టెప్పులేయనున్నారు. వీరిద్దరి కాంబినేషన్ అనగానే అందరికీ ముందుగా గుర్తుకొచ్చేది అప్పట్లో సంచలన విజయం సాధించిన 'శివాజీ' చిత్రం. ఆ సినిమా వచ్చి దాదాపు 19 ఏళ్లు పూర్తయిన తర్వాత, మళ్లీ వీరిద్దరూ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. కాగా.. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్నారు. రామ్ పోతినేని, రాశి ఖన్నా, సిమ్రాన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో మూడో షెడ్యూల్ జరుపుకుంటున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# డోస్ పెంచేసిన ప్రగ్యా జైస్వాల్..

విజయాలు పెద్దగా లేకపోయినా తన అందచందాలతో కుర్రకారును ఆకట్టుకుంటున్న ముద్దుగుమ్మల్లో ప్రగ్యా జైస్వాల్ ఒకరు. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఈ బ్యూటీకి మంచి క్రేజ్ ఉంది. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ప్రగ్యా.. తన గ్లామరస్ ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ సందడి చేస్తుంటుంది. దీంతో ఆమె పోస్ట్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారుతుంటాయి. రోజురోజుకూ ప్రగ్యా ఫాలోవర్ల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. తాజాగా మరోసారి ఈ బ్యూటీ గ్లామర్ డోస్ పెంచేసింది. సిల్వర్ డ్రెస్‌లో సూపర్ హాట్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంది. ఫ్రంట్, బ్యాక్‌తో పాటు సైడ్ యాంగిల్స్‌లోనూ తన అందాలు హైలైట్ అయ్యేలా ఫొటోలకు పోజులిచ్చింది. ఈ ఫొటోల్లో ప్రగ్యా గ్లామర్ మరింతగా హైలైట్ కావడంతో ఆమె పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అదిరిపోయే లుక్స్‌తో ప్రగ్యా ఇచ్చిన ఈ ఫొటోలకు నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తోంది. లైక్స్, కామెంట్లతో సోషల్ మీడియా హోరెత్తుతోంది. పలువురు అభిమానులు ప్రగ్యా అందాలను ప్రశంసిస్తూ కామెంట్లు చేస్తున్నారు.

Pragya Jaiswal



# స్ట్రాంగ్ ఫీమేల్ క్యారెక్టర్స్ డిజైన్ చేస్తోన్న తమిళ్ ఇండస్ట్రీ




హీరోయిన్స్‌కు స్ట్రాంగ్ క్యారెక్టర్స్ దొరకడం చాలా అరుదు. దొరికితే కచ్చితంగా హీరోలను డామినేట్ చేసేస్తారు అందులో నో డౌట్. తమిళంలో రీసెంట్ టైమ్స్‌లో అలాంటి కొన్ని ఫీమేల్ రోల్స్ మెస్మరైజ్ చేస్తున్నాయి. అఫ్ కోర్స్ థాయి కిళవి ఫీమేల్ సెంట్రిక్ ఫిల్మే అయినప్పటికీ.. పవన్ తాయిగా రాధికా శరత్ కుమార్ నటనను అంత ఈజీగా మర్చిపోలేరు తమిళ తంబీలు. రాధిక నటనే కానీ, మేకప్ కోసం ఆమె పడ్డ కష్టమే కానీ టాప్ నాచ్ అంతే. విశ్వనాథ్ అండ్ సన్స్‌లో కూడా మంచి స్కోప్ ఉన్న పాత్ర దక్కింది సీనియర్ నటీమణికి. ఇప్పటి వరకు గ్లామర్ రోల్స్‌కే పరిమితమైన ప్రీతి ముకుందన్‌లోని అసలు సిసలైన ఫెర్ఫామెన్స్ బయటకు తీసిన సినిమా బ్లాస్ట్. పేరుకు అర్జున్ సార్జా హీరో కానీ ఇందులో స్ట్రాంగ్ లేడీగా విలన్స్‌ను రఫ్ఫాడించే సగటు యువతిగా కనిపించి ఆకట్టుకుంది ప్రీతి. అలా అని అభిరామిని తక్కువగా చూపించలేదు. ఆమెకివ్వాల్సిన స్కోప్ ఆమెకు ఇచ్చేశాడు డైరెక్టర్. లోకేశ్ కనగరాజ్ హీరోగా రీసెంట్లీ విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన డీసీలో వామికా గబ్బీ రోల్‌ను స్ట్రాంగ్‌గా డిజైన్ చేశాడు దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్. చంద్ర పాత్రలో ఆమె నటించిన తీరు ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంది. సూర్య ఉన్నాడంటే మరొకరి స్కోప్ ఉండదు.. స్క్రీన్ ప్రజెన్స్ అంతా తన నటనతో నమిలేస్తాడు. అలాంటిది విశ్వనాథ్ అండ్ సన్స్‌లో మమితా బైజుకు స్కోప్ ఉన్న పాత్ర రాశాడు వెంకీ అట్లూరి. మ్యాడీ రోల్‌లో ఎనర్జటిక్‌గా నటించి ఆడియన్స్ అటెన్షన్ తన వైపు తిప్పుకుంది మమిత. ఇదే కాదు 29లో ప్రీతి అస్రానీ క్యారెక్టర్, విత్ లవ్‌లో అనశ్వర రాజన్ రోల్స్ కూడా హీరోలతో సమానంగా క్యారెక్టర్స్ డిజైన్ చేశారు మేకర్స్. హీరోయిన్ క్యారెక్టర్స్ స్ట్రాంగ్ ఉండాలంటే ఫీమేల్ ఓరియెంట్ చిత్రాలే అవసరం లేదని ప్రూవ్ చేస్తున్న తమిళ్ మేకర్స్‌ను చూసి.. తెలుగు మేకర్స్ ఇన్ స్పైర్ అవుతారా..?

# ఆ సీన్ను తొలగించాలంటూ...




మాస్ మహారాజ రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కలసి తీసిన లేటెస్ట్ మూవీ 'ఇరుముడి' బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర, సాయి కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా ఆగస్టు 21న విడుదలై ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణతో పాటు భారీ కలెక్షన్లు రాబడుతోంది. సినిమాలో కొన్ని సీన్లు ప్రేక్షకులను బాగా ఏడిపించేలా ఉన్నాయి. అయితే, హిట్ టాక్‌తో దూసుకెళ్తున్న ఈ సినిమా ఇప్పుడు ఒక ఊహించని వివాదంలో చిక్కుకుంది. సినిమాలో ప్రభుత్వ పాఠశాలలను, టీచర్లను కించపరిచేలా సన్నివేశాలు ఉన్నాయని, వాటిని వెంటనే తీసేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య నాయకులు చెన్నుపాటి మంజుల, బసవలింగారావు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లు, టీచర్లు, పిల్లల గురించి సినిమాలు తీసేటప్పుడు దర్శకులు కాస్త బాధ్యతగా ఉండాలని చెప్పారు. 'ఇరుముడి'లో గవర్నమెంట్ స్కూల్ లేడీ టీచర్ పాత్రను చాలా నెగెటివ్‌గా చూపించడంపై వారు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ఏదో ఊహాజనిత పాత్ర కాదని, ఆ సీన్ వెనుక ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాల స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. అంతేకాకుండా, సినిమాలో పిల్లలు వేసుకున్న యూనిఫాం కూడా ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లలో వాడేదేనని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు జిల్లా పరిషత్తు పాఠశాల పేరును వాడుతూ ఉపాధ్యాయ వృత్తిని, స్కూల్ వ్యవస్థను తక్కువ చేసి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమా సమాజంపై ఎక్కువ ప్రభావం చూపిస్తుంది కాబట్టి, టీచర్లను ఇలా చూపించడం వల్ల వారిపై చెడు ముద్ర పడుతుందని, వెంటనే ఆ సీన్లను తొలగించాలని కోరారు. అంత మంచి సినిమాను తీసిన దర్శకుడు ఆ సీన్స్ పెట్టి.. విమర్శలు ఎదుర్కొంటున్నారు.

# ఇప్పటివరకు క్లాస్ రోల్స్‌కే పరిమితం..



సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన కొత్తలో క్లాస్ పాత్రలతో ఆకట్టుకుని, మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న తర్వాత గ్లామర్‌తో కుర్రకారును అలరించిన ముద్దుగుమ్మలు ఎంతోమంది ఉన్నారు. తాజాగా సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జంటగా 'రోమాంచకం' అనే చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. సందీప్ రెడ్డి వంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటివరకు పలు చిత్రాల్లో నటించిన అనంతిక సనీల్ కుమార్ స్కిన్ షోకు దూరంగా ఉంటూ క్లాస్ పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కొంతకాలం క్రితం ఓ ఇంటర్వ్యూలో సందీప్ రెడ్డి వంగా చిత్రాల్లో గ్లామర్ డోస్ కాస్త ఎక్కువగా ఉంటుంది. ఈ సినిమాలో కూడా అలాంటి సన్నివేశాలు ఉంటాయా? అని ఆమెను ప్రశ్నించగా.. అడల్ట్ సన్నివేశాల గురించి మాట్లాడితే, తమ సినిమాలో అలాంటి సన్నివేశాలు లేవని సమాధానం ఇచ్చింది. తాజా ఇంటర్వ్యూలో 'మీరు ప్రస్తుతం క్లాస్ పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. రాబోయే రోజుల్లో గ్లామర్ పాత్రలు చేసే అవకాశం ఉందా?' అని అనంతికను ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. నేను కచ్చితంగా గ్లామర్ పాత్ర చేయాలని అనుకోను. అయితే పాత్ర డిమాండ్ చేస్తే, అందులో ఏదైనా కొత్తదనం ఉంటే మాత్రం చేయవచ్చు అని చెప్పింది. అనంతిక చేసిన ఈ వ్యాఖ్యలతో భవిష్యత్తులో పాత్ర డిమాండ్ చేస్తే గ్లామరస్ పాత్రల్లోనూ కనిపించే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు.



# అద్భుతమైన రీ-ఎంట్రీ అంటున్న నెటిజన్లు

'హనుమాన్' ఫేమ్ దర్శకుడు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తోన్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'మహాకాళి'. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వంలో అద్భుతమైన విజువల్స్, గ్రాఫిక్స్‌తో RKD స్టూడియోస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మూవీ నుంచి తాజాగా 'శుక్రాచార్య' పాత్రకు సంబంధించిన గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా లుక్, ఆయన ఇంటెన్స్ స్క్రీన్ ప్రెజెన్స్, వార్ క్రై గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. ఇందులో ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే.. వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శ్రీయా రెడ్డి 'కాళీమాత'గా పవర్‌ఫుల్‌గా కనిపించారు. పసి పాపను పొత్తిళ్లలో వేసుకుని పాలు ఇస్తున్న ఒక మాతృమూర్తిలా కనిపిస్తూనే.. అంతలోనే కాళీమాతలా విజృంభించిన తీరు (మేకోవర్) మహాకాళి గ్లింప్స్‌కే ప్రత్యేక ఆకర్షనగా నిలిచింది. కాగా.. 'సలార్', 'OG' వంటి చిత్రాల తర్వాత ఇప్పుడు ఈ సినిమాలో అత్యంత శక్తివంతమైన పాత్రలో శ్రీయా రెడ్డి కనిపించడంతో.. శ్రీయాకు ఇది నిజంగా ఒక అద్భుతమైన రీ-ఎంట్రీ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**